ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
గుంటూరు జిల్లా వార్తలు
5
సోమవారం 14 అక్టోబరు 2024



ముగిసిన దసరా ఉత్సవాలు

ఈ నెల 3న ప్రారంభమైన దసరా శరన్నవరాత్రి ఉత్సవాలు శమీ వృక్ష పూజలతో శనివారం రాత్రి ముగిశాయి. తొమ్మిది రోజులు వివిధ అలంకారాల్లో దర్శనమిచ్చిన అమ్మవారు పదో రోజైన శనివారం శాంతమూర్తి అవతారమైన రాజరాజేశ్వరిదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. పట్టువస్త్రాలు, వివిధ రకాల పుష్పాలతో అమ్మవారిని సర్వాంగ సుందరంగా అలంకరించారు. అమ్మవారిని దర్శించుకునేందుకు ఆలయాల వద్ద భక్తులు బారులు తీరారు. దేవతామూర్తులకు ప్రధాన వీధుల్లో గ్రామోత్సవం నిర్వహించారు. జిల్లావాసులు విజయదశమి పర్వదినాన్ని వైభవంగా జరుపుకున్నారు. వేకువజామునుంచే ఆలయాలకు భక్తులు పోటెత్తారు. దీంతో ఆలయాలు కిటకిట లాడాయి. అమ్మవారికి విశేష అభిషేకాలు, అర్చనలు, అలంకరణలు జరిగాయి.

- గుంటూరు



పొన్నూరు: సుగంధ ద్రవ్యాల అలంకారంలో దర్శనమిస్తున్న శ్రీతోటమ్మ తల్లి



తెనాలి: కొలకలూరు కాకతీయ యూత్ ఆధ్వర్యంలో గ్రామోత్సవంలో భక్తులకు దర్శనిమిస్తున్న అమ్మవారు



గుంటూరు: విద్యానగర్ 3వ లైన్‌లో శ్రీ సాయినాథ సన్నిధానంలో శ్రీ రాజరాజేశ్వరీదేవిగా అమ్మవారు



- కేంద్రం సూత్రప్రాయంగా అంగీకారం
- సర్వేల దశలో ఉన్న రెండు రైల్వే ప్రాజెక్టులు
- ఇవి ఏర్పాటైతే ఉమ్మడి గుంటూరు జిల్లాకు నలువైపులా కనెక్టివిటీ
- రైల్వే మంత్రి వైష్ణవ్‌తో ఇటీవల సీఎం చంద్రబాబు సమావేశంలో చర్చ

మరో రెండు రైలు మార్గాలు

గుంటూరు, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి గుంటూరు జిల్లాకు మరో రెండు కొత్త రైలు మార్గాలు మంజూరు కానున్నాయి. ఇప్పటికే ప్రిలిమి నరీ-కమ్-ట్రాఫిక్, ఫైనల్ లొకేషన్ సర్వేలు పూర్తి చేసుకున్నాయి. అయితే ఈ ప్రాజెక్టులు గత కొన్నేళ్ల నుంచి రైల్వే శాఖ అటకెక్కించింది. ప్రస్తుతం కేంద్రం, రాష్ట్రంలో ఎన్‌డీఏ కూటమి ప్రభుత్వాలు అధికారంలో ఉండటం, ఆంధ్రప్రదేశ్‌కు చెందిన టీడీపీ, జనసేన ఎంపీలపై కేంద్ర ప్రభుత్వం ఆధార పడటంతో అటకెక్కించిన ఆ ప్రాజెక్టులను చేపట్టేందుకు రైల్వే శాఖ సూత్రప్రాయంగా అంగీకారం తెలిపింది. కేంద్ర రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్‌తో సీఎం చంద్రబాబునాయుడు జరిపిన సమావేశంలోనూ ఈ రెండు ప్రాజెక్టులపై చర్చ జరగడం సానుకూల వాతావరణాన్ని ఏర్పరుస్తున్నది. సాధ్యమైనంత త్వరగా వీటిని రైల్వే కేటాయింపులు (పింక్‌బుక్)లో చేర్చి నిధులు మంజూరు చేస్తే మూడు, నాలుగేళ్లలో ప్రాజెక్టులు పూర్తి అయ్యే అవకాశం ఉన్నది.

మచిలీపట్నం - రేపల్లె - బాపట్ల

మచిలీపట్నం-రేపల్లె నూతన రైలుమార్గం నిర్మాణం చేయాలన్నది దశాబ్ధాలుగా తీర ప్రాంతాల ప్రజల ఆకాంక్ష. ఈ రెండు పట్టణాల మధ్య కేవలం 45.30 కిలోమీటర్ల దూరం ఉన్నది. రైలుమార్గంతో కలిపితే పలు రైళ్లని చుట్టూ తిరిగి విజయవాడ వైపునకు వెళ్లకుండా రేపల్లె-తెనాలి మీదగా మళ్లించొ చ్చు. పైగా చెన్నై, హైదరాబాద్, బెంగళూరు వంటి ప్రముఖ నగరాలకు ప్రయాణ దూరం కూడా తగ్గుతుంది. అయితే ఈ మార్గంలో క్లిష్టమైన కృష్ణా నదిపై మూడు కిలో మీటర్ల దూరం పైగా వంతెన నిర్మాణం చేపట్టాల్సి ఉంటుంది. ఇందుకు కారణం ఇక్కడ కృష్ణానది వెడ ల్పు పాయలు గా విడిపోయి ఎక్కువగా ఉంటుంది. అయినా ఎట్టకేలకు గత ఆగస్టు నెల 20న ఫైనల్ లోకేషన్ సర్వేని రైల్వేశాఖ మంజూరు చేసింది. ఈ సర్వే పూర్తి అయితే రైలు మార్గం నిర్మాణం చేపట్టడానికి వీలు కలుగుతుంది. రేపల్లె - బాపట్ల నూతన రైలుమార్గం ప్రిలిమినరీ ఇంజనీరింగ్- కమ్- ట్రాఫిక్ సర్వే కూడా మంజూరైంది. దీనిని నిజాంపట్నం పోర్టు మీదగా సర్వే చేసి రిపోర్టు కూడా పంపించారు. రూ.792.33 కోట్లు ఖర్చు అవుతుందని అంచనా వేశారు. రేట్ ఆఫ్ రిటర్న్స్ చూసుకుంటే -8.72 శాతంగా రావడంతో రైల్వే శాఖ 2017లోనే దీనిని అటకెక్కించింది. ఇప్పుడు సరుకు రవాణాకు సదుపాయాలను పెంచుతుండటంతో ఈ ప్రాజెక్టుని చేపట్టేందుకు రైల్వే మంత్రి అంగీకరించినట్లు సీఎం చంద్రబాబు ప్రకటించారు.

తెనాలి - రేపల్లె మధ్య డబ్లింగ్..

తెనాలి-రేపల్లె మధ్యన డబ్లింగ్, విద్యుద్దీకరణ ప్రాజెక్టుకు సంబంధించి ప్రిలిమినరీ ఇంజనీరింగ్ కమ్ ట్రాఫిక్ సర్వే 2015 లోనే పూర్తి అయింది. దీనికోసం రూ.259.91కోట్లు ఖర్చు చేయాల్సి ఉంటుంది. అయితే రేట్ ఆఫ్ రిటర్న్స్ -25.35 శాతంగా ఉండటంతో రైల్వేశాఖ పక్కన పెట్టేసింది. దీనిని కూడా ఇప్పుడు చేపట్టేందుకు రైల్వేశాఖ అంగీకారం తెలిపింది. దీంతో ఉమ్మడి గుంటూరు జిల్లాకు రెండు కొత్త రైలు మార్గాలతో పాటు ఒక డబ్లింగ్ రాబోతున్నది.

- దరఖాస్తుదారుల్లో ఉత్కంఠ
- మద్యం షాపులకు నేడు లాటరీ
- ఉదయం 7 నుంచి ప్రక్రియ ప్రారంభం
- బాపట్లలో 117 షాపులకు 2149 దరఖాస్తులు
- పల్నాడు జిల్లాలో 129 దుకాణాలకు 2639..
- గుంటూరులో 127 షాపులకు 4448 దరఖాస్తులు

లక్కెవరికో?

గుంటూరు కార్పొరేషన్/నరసరావుపేట, బాపట్ల (ఆంధ్రజ్యోతి) అక్టోబరు 13: ఇప్పటివరకు మద్యం విక్రయాలను ప్రభుత్వం చేపట్టగా ఆ స్థానంలో వ్యాపారులు రానున్నారు. కూటమి ప్రభుత్వం నూతన మద్యం పాలసీ ప్రవేశపెట్టింది. ఈ క్రమంలో మద్యం వ్యాపారంపై ఆసక్తి ఉన్న వారి నుంచి ప్రభుత్వం దుకాణాల వారీగా దరఖాస్తులను స్వీకరించింది. గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల పరిధిలో దుకాణాలకు పలువురు దరఖాస్తులు చేసుకున్నారు. ఈ నెల 1 నుంచి ప్రారంభమైన ఈ దరఖాస్తుల ప్రక్రియ సోమవారం జరగనున్న లాటరీ అంకంతో ఓ కొలిక్కి రానుంది. సిండికేట్ మంతనాలు.. స్థానికేతరుల అంశంలో బెదిరింపులు.. ఇలా ఎన్నో ప్రతిబంధకాల మధ్య పది రోజులకు పైగా దరఖాస్తుల ప్రక్రియ ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో సాగింది. శుక్రవారం రాత్రితో దరఖాస్తుల అంకం ముగియగా శని, ఆదివారాల్లో పరిశీలనలు జరిగాయి. ఆయా దరఖాస్తుల లాటరీ సోమవారం జిల్లా కేంద్రాల్లో నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లు చేశారు. అయితే అదృష్టం ఎవరిని వరిస్తోందోనని రూ.2 లక్షలు ఫీజు కట్టి దుకాణాలకు దరఖాస్తులు చేసుకున్న వారిలో ఉత్కంఠ నెలకొంది. దరఖాస్తుదారులు ఉదయం 7 గంటలకే లాటరీ తీసే కేంద్రాలకు రావాలని 8 గంటల నుంచి ప్రక్రియ ప్రారంభమవుతుందని ఎక్సైజ్ అధికారులు తెలిపారు. దరఖాస్తుదారులు మాత్రమే రావాలని బయటవారెవరికీ దానిలోకి ప్రవేశం లేదని అధికారులు తెలిపారు. మొత్తం ప్రక్రియ కలెక్టర్, జేసీల సమక్షంలో జరుగుతుందని,



ప్రసంగిస్తున్న గుంటూరు ఎక్సైజ్ శాఖ డిప్యూటీ కమిషనర్ డాక్టర్ కే శ్రీనివాసులు, పక్కన ఏసీ రవికుమార్ రెడ్డి, ఈఎస్ అరుణకుమారి

వీడియోగ్రఫీ కూడా తీస్తామని చెప్పారు. లాటరీలో షాపు దక్కించుకున్న వారికి 15న లైసెన్సులు అందిస్తామన్నారు. లాటరీలో అదృష్టం వరించిన వ్యాపారి రెండు రోజుల్లో షాపు ఏర్పాటు చేసుకోవాలని అధికారులు తెలిపారు. 16 నుంచి ప్రైవేట్ మద్యం షాపులు ప్రారంభం కానున్నాయి. లాటరీ తీసే కేంద్రాల వద్ద ప్రత్యేకంగా పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. లాటరీ ప్రక్రియలో ఎలాంటి అవాంచనీయ సంఘటనలు జరగకుండా ముందస్తు చర్యల్లో భాగంగా ఈ చర్యలు చేపట్టారు. బాపట్ల జిల్లాలోని 117 షాపులకు 2149 దరఖాస్తులు వచ్చాయి. సగటున ఒక్కో షాపునకు 18 దరఖాస్తులు వచ్చినట్లైంది. గుంటూరు జిల్లాలోని 127 షాపులకు అత్యధికంగా 4448 దరఖాస్తులు వచ్చాయి. సగటున ఒక్కో షాపునకు 35 దరరఖాస్తులు వచ్చినట్లైంది. పల్నాడు జిల్లాలో మొత్తం 129 షాపులకు 2,639 దరఖాస్తులు దాఖలు కాగా సగటున ఒక్కో షాపునకు 20 దరఖాస్తులు వచ్చినట్లైంది. మద్యం షాపుల కేటాయింపులో నెలకొన్న ఉత్కంఠకు మరి కొద్ది గంటల్లో తెరపడనున్నది. పల్నాడు ప్రాంతంలో ఒక్కో వ్యాపారి పది షాపుల వరకు దరఖాస్తులు దాఖలు చేశారు. కొందరు వ్యాపారులు గ్రూపుగా ఏర్పడి దరఖాస్తులు వేశారు. ఏ షాపు ఎవరికి దక్కుతుందోన్న ఉత్కంఠ దరఖాస్తుదారుల్లో నెలకొంది.

- బాపట్ల జమ్ములపాలెం రోడ్డులోని ఎమ్మెస్సార్ కల్యాణ మండపంలో లాటరీ ప్రక్రియ సోమవారం జరగనున్నట్లు ఎక్సైజ్ సూపరింటెండెంట్ దేవదత్తు తెలిపారు. స్టేషన్ల వారీగా లాటరీ తీయడం జరుగుతుందని, ఇందుకు 2 కౌంటర్లను ఏర్పాటు చేశామన్నారు. కల్యాణమండపం వద్ద 120 మంది పోలీసులతో భద్రతా ఏర్పాట్లు చేశారు.
- నరసరావుపేట ప్రకాష్‌నగర్‌లోని భువనచంద్ర టౌన్‌హాల్‌లో మద్యం షాపుల లాటరీ తీయనున్నారు. లాటరీ నిర్వహణ ఏర్పాట్లను ఎక్సైజ్ ఈఎస్ మణికంఠ పర్యవేక్షిస్తున్నారు. కలెక్టర్ అరుణ్‌బాబు లాటరీ తీయనున్నారు.
- గుంటూరు జిల్లాకు సంబంధించి గుంటూరులోని వెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో లాటరీ నిర్వహణకు ఏర్పాట్లు చేసినట్లు గుంటూరు ఎక్సైజ్ డీసీ డాక్టర్ కే శ్రీనివాసులు తెలిపారు. ఆదివారం గుంటూరులో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రెండు కౌంటర్ల ద్వారా లాటరీ నిర్వహిస్తామన్నారు. ఒక కౌంటర్‌కు కలెక్టర్, మరో కౌంటర్‌కు జాయింట్ కలెక్టర్ ఆధ్వర్యంలో లాటరీ ప్రక్రియ జరుగుతుందన్నారు. సమావేశంలో ఏసీ రవికుమార్‌రెడ్డి, గుంటూరు ఈఎస్ అరుణకుమారి తదితరులు పాల్గొన్నారు.



నరసరావుపేటలోని భువనచంద్రటౌన్ హాల్లో జరిగిన ఏర్పాట్లు

విజేతలు వెంటనే ఫీజు చెల్లించాలి..

దుకాణాలకు వచ్చిన దరఖాస్తుల నుంచి లాటరీ తీసి లైసెన్సు పొందిన వారి పేర్లను అధికారులు ప్రకటించేందుకు అవసరమైన ఏర్పాట్లు చేశారు. లాటరీతో పాటు లైసెన్సుల జారీ చేసే ప్రక్రియ పూర్తి పారదర్శకంగా జరుగుతుందని ఎక్సైజ్ శాఖ చెబుతోంది. లైసెన్సులు జారీకి షాపుల వారీగా వచ్చిన దరఖాస్తులను లాటరీ తీసి విజేతను ఎంపిక చేస్తారు. దీనితో పాటు మరో ఇద్దరిని రిజర్వుగా ఎంపిక చేయనున్నారని తెలిసింది. లాటరీలో లైసెన్సు దక్కించుకున్న వారు వెంటనే నిర్ధేశిత మొత్తాన్ని ఎక్సైజ్ శాఖకు చెల్లించాలి. ఇలా సకాలంలో ఎవరైనా నగదు చెల్లించకపోవడంతో పాటు ఏదైనా అత్యవసర కారణాల వల్ల లాటరీలో షాపు వరించిన వ్యక్తి పక్కకు తప్పుకుంటే నిబంధనల ప్రకారం రిజర్వులో ఉన్న తొలి వ్యక్తికి అవకాశం కల్పించనున్నారు. బ్యాంకర్లను కూడా ఆయా వేదికల వద్దే ఏర్పాటు చేశారు. లాటరీలో గెలుపొందిన వ్యక్తి షాపు దరావత్ ఫీజులో 1/6 వంతు అప్పటికప్పుడు అక్కడే చెల్లించే విధంగా సౌకర్యం కల్పించామన్నారు.

లైసెన్సును మార్చడానికి వీల్లేదు

తెరవెనక బేరసారాలతో లాటరీలో విజేత నుంచి లైసెన్సును పొందడం సాంకేతికంగా చెల్లదని ఎక్సైజ్ శాఖ చెబుతోంది. ఒక వేళ ఏదైనా సహేతుక కారణాలతో లైసెన్సును వేరే వారిపేరు మీదకు మార్చాలనుకున్నా అది జీవీఏ రూపంలోనే వర్తిస్తుందని దానికి కూడా దరఖాస్తుదారుడు లక్షల్లోనే అదనపు రుసుం చెల్లించాల్సి వస్తుందని అధికారులు తెలిపారు. లాటరీ, దుకాణం ఏర్పాటు ప్రక్రియ మార్గదర్శకాలకు అనుగుణంగానే జరుగుతుందని ఎలాంటి అవకతవకలకు ఆస్కారం ఉండదన్నారు. లాటరీలో విజేతలుగా నిలిచినవారు మాత్రమే షాపు పెట్టుకోవడానికి అర్హులని ఎక్సైజ్ శాఖ అధికారులు చెబుతున్నారు.

బేరసారాలకు రంగం సిద్ధం..

మద్యం వ్యాపారాన్ని చేజిక్కించుకునేందుకు దుకాణాల దరఖాస్తుల ప్రక్రియలో పాలకపార్టీ నేతలు జోక్యం చేసుకున్నారు. దీంతో చాలాదగ్గర్ల దరఖాస్తులు వేసేందుకు వ్యాపారులు వెనుకంజ వేశారు. ఈ పరిస్థితుల్లో నేతల తీరుపై టీడీపీ అధిష్ఠానం ఆగ్రహం వ్యక్తం చేసింది. దీంతో సిండికేట్ ప్రతిపాదనల నుంచి నేతలు వైదొలిగారు. దాని ఫలితమే గడువు పొడిగించిన చివరి రెండు రోజుల్లో దరఖాస్తుల సంఖ్య పెరిగింది. అయితే ఆయా నేతల కన్ను ప్రస్తుతం లాటరీలో షాపు దక్కించుకునే వారిపై పడినట్లు తెలిసింది. బాపట్ల జిల్లాలో నేతల దృష్టంతా లైసెన్సుల దక్కేవారిపై ఉన్నట్లు సమాచారం. లైసెన్సును టోకుగా కైవశం చేసుకోవడమో లేదంటే తాము సూచించిన వ్యక్తులను భాగస్వాములుగా చేర్చుకునే విధంగా విజేతలతో మంతనాలు జరపడానికి జిల్లాలో నేతలు సిద్ధం చేసినట్లు తెలుస్తోంది.

- నేటి నుంచి 20 వరకు వారోత్సవాలు
- ప్రతీ గ్రామంలో వివిధ పనులకు శంకుస్థాపనలు
- బాపట్ల జిల్లాలో 600 పనులకు రూ.72 కోట్లతో శ్రీకారం
- పల్నాడు జిల్లాలో 9,397 పనులు.. వ్యయం రూ.286.15 కోట్లు
- గుంటూరు జిల్లాలో 166 పనులకు రూ.14.35 కోట్ల మంజూరు

పల్లెల్లో అభివృద్ధి పండుగ

గుంటూరు, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): నిర్లక్ష్యం.. నిధుల లేమి.. కేంద్రం నిధుల దారిమళ్లింపు.. సచివాలయాలతో ఉత్సవ విగ్రహాలుగా మారిన పంచాయతీలు.. మొత్తం మీద వైసీపీ పాలనలో పల్లెలు అభివృద్ధి లేక కుంటుపడిపోయాయి. ఈ పరిస్థితుల్లో పంచాయతీలను పురోగమన బాట పట్టించడానికి కూటమి ప్రభుత్వం వేగంగా అడుగులేస్తోంది. పంచాయతీలకు పూర్వవైభవం తీసుకొచ్చేందుకు ప్రణాళికలు రూపొందించింది. ఇందులో భాగంగా ఆగస్టులో ఒకేరోజు గ్రామసభల నిర్వహణ.. సమస్యలపై వినతుల స్వీకరణ.. అభివృద్ధి పనులపై తీర్మానాలు చేశారు. ఈ కార్యక్రమానికి కొనసాగింపుగా సోమవారం నుంచి వారం రోజులు పల్లె పండుగ కార్యక్రమాన్ని నిర్వహించేందుకు ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ఈ పండుగ వారోత్సవాల్లో గ్రామాల్లో పలు అభివృద్ధి పనులకు ప్రజాప్రతినిధులు శంకుస్థాపనలు చేయనున్నారు. పల్లె పండుగ - పంచాయతీ వారోత్సవాల నిర్వహణకు గ్రామాల్లో అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. సోమవారం నుంచి 20వ తేదీ వరకు ప్రభుత్వం ఇచ్చిన షెడ్యూల్ ప్రకారం రోజుకు 15 గ్రామాలకు తగ్గకుండా అభివృద్ధి పనుల శంకుస్థాపనలకు ప్రణాళికలు రూపొందించారు. రోడ్లు, మురుగుకాల్వలు, తాగునీరు వంటి సమస్యలను తక్షణమే పరిష్కరించనున్నారు. 15వ ఆర్థిక సంఘం, ఉపాధి హామీ పథకం కింద పల్లెలో ప్రగతి పనులకు సోమవారం నుంచి శ్రీకారం చుట్టనున్నారు. ఇప్పటికే ఉపాధి హామీ పథకం కింద చేపట్టనున్న పనులను గుర్తించి అంచనాలను కూడా అధికారులు రూపొందించారు. గ్రామాల వారీగా మొత్తం 46 రకాల పనులకు ఆమోదం తీసుకున్నారు. ఆయా పనులను సంక్రాంతి నాటికి పూర్తి చేసి ప్రారంభోత్సవాలు చేస్తామని అధికారవర్గాలు తెలిపాయి. ఉపాధి హామీ పథకం పనుల నిర్వహణ నిమిత్తం ఆగస్టు 23న జరిగిన గ్రామసభల్లో ప్రజాభిప్రాయం మేరకు తీర్మానాలు కూడా చేశారు.

- గుంటూరు జిల్లాలోని 166 గ్రామాల్లో అభివృద్ధి పనులకు రూ.14.35 కోట్లను ప్రభుత్వం విడుదల చేయనుంది. తొలి రోజున మంగళగిరి నియోజకవర్గంలో గొడవర్రు, పెదకొండూరు, వీర్లపాలెం, పొన్నూరు నియోజకవర్గంలో మాచవరం, ములుకుదురు, నండూరు, శేకూరు, వీరనాయకునిపాలెం, ప్రత్తిపాడు నియోజకవర్గంలో జొన్నలగడ్డ, ప్రత్తిపాడు, తాడికొండ నియోజకవర్గంలో దామరపల్లి, కంతేరు, ఫణిదరం, పొన్నెకల్లు, తెనాలిలోని అంగలకుదురు, చావావారిపాలెం గ్రామాల్లో జరగనున్న అభివృద్ధి పనుల శంకుస్థాపనలకు స్థానిక ఎమ్మెల్యేలు హాజరౌతారని డ్వామా అధికారులు తెలిపారు.
- బాపట్ల జిల్లా వ్యాప్తంగా ఉన్న 458 పంచాయతీల పరిధిలో 600 పనులకు రూ.72కోట్ల వ్యయం చేయనున్నారు. పల్లె పండుగ కార్యక్రమంలో సంతమాగులూరు మండలం ఏల్చూరులో మంత్రి గొట్టిపాటి రవికుమార్ పాల్గొననున్నారు. చుండూరు మండలం యడ్లపల్లిలో వేమూరు ఎమ్మెల్యే నక్కా ఆనంద్‌బాబు పలు పనులకు భూమి పూజ చేయనున్నారు
- పల్నాడు జిల్లాలో రూ.286.15 కోట్లతో 9,397 పనులు చేపడుతున్నట్లు అధికారులు తెలిపారు.



- అకడమిక్ పుస్తకాలు అందుబాటులోకి తీసుకొస్తాం
- గ్రంథాలయంలో విద్యార్థులతో కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని

గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలి

గుంటూరు, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): గ్రంథాలయాల్లో విద్యార్థులు, పాఠకులకు అవసరమైన పుస్తకాలను అందుబాటులో ఉంచాలని, ప్రతి ఒక్కరూ గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలని కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ తెలిపారు. గుంటూరులోని గ్రంథాలయాన్ని ఆదివారం ఆయన పరిశీలించారు. గ్రంథాలయ భవనం శిథిలావస్థలో ఉండటాన్ని గమనించి భవన, నిర్వహణ వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. శ్లాబులు పెచ్చులూడి వర్షాలకు నీటి చెమ్మ వస్తుందని అధికారులు మంత్రి దృష్టికి తీసుకొచ్చారు. పేపర్లు, మ్యాగజైన్ల కొనుగోలుకు నిధులు కేటాయించక పోవడంతో పాఠకులు ఇబ్బందులు పడుతున్నార న్నారు. అక్కడున్న విద్యార్థులతో మంత్రి పెమ్మసాని మాట్లాడారు. అన్ని రకాల పుస్తకాలు దొరుకుతున్నాయా? చదువుకోవడానికి సౌకర్యంగా ఉందా? అని వారిని ప్రశ్నించారు. అకడమిక్ పుస్తకాలు అందుబాటులో లేవని, మరిన్ని సౌకర్యాలు కల్పిస్తే ఎక్కువ మంది ఇక్కడికే వచ్చి చదువుకుంటారని విద్యార్థులు చెప్పారు. అన్ని రకాల అకడమిక్ పుస్తకాలు అందుబాటులోకి తీసుకొస్తామని పెమ్మసాని వారికి హామీ ఇచ్చారు. కార్యక్రమంలో తూర్పు ఎమ్మెల్యే మహమ్మద్ నసీర్, జనసేన జిల్లా అధ్యక్షుడు గాదె వెంకటేశ్వరరావు, క్రిస్టియన్ మైనారిటీ సెల్ నేత మద్దిరాల మ్యాని, కార్పొరేటర్ వేములపల్లి శ్రీరాంప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులతో మాట్లాడుతున్న కేంద్ర మంత్రి పెమ్మసాని, ఎమ్మెల్యే నసీర్

అక్రమ నిర్మాణాలకు చిరునామా గ్రీన్ గ్రేస్

● ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్ర కుమార్



పొన్నూరుటౌన్, అక్టోబరు 13: గ్రీన్ గ్రేస్ అపార్ట్‌మెంట్లు అక్రమ నిర్మాణాలకు చిరునామాగా మారాయని పొన్నూరు ఎమ్మెల్యే, సంగం డెయిరీ ఛైర్మన్ ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్ ఆరోపించారు. శనివారం పొన్నూరులో జరిగిన విలేకర్ల సమావేశంలో ఎమ్మెల్యే నరేంద్ర కుమార్ మాట్లాడుతూ గ్రీన్ గ్రేస్ ఆపార్ట్‌మెంట్ల నిర్మాణంలో నిబంధనలను పూర్తిగా ఉల్లంఘించారని స్పష్టం చేశారు. అధికారాన్ని అడ్డం పెటుకొన్ని అనేక అక్రమాలకు నిర్మాణదారులు పాల్పడ్డారని ఆరోపించారు. అనుమతులు లేకుండా అక్రమంగా నిర్మాణాలు చేస్తూ వినియోగదారుల నుంచి డబ్బులు వసూళ్లు చేసి మోసం చేశారని ధ్వజమెత్తారు. అంబటి మురళీకృష్ణకు ఈ అక్రమాలు తెలిసే మోసగించారని దుయ్యబట్టారు. స్వయంగా అంబటి మురళీకృష్ణ జి + 4 నిర్మాణాలకు అనుమతులు ఉన్నాయని వెల్లడించటమే మిగిలిన నిర్మాణాలకు అనుమతులు లేవని స్పష్టమౌతుందన్నారు. రైల్వే ఎన్వోసీ లేకపోయినా నిర్మాణాలు చేపట్టడం అక్రమం కాదా అని ప్రశ్నించారు. నిర్మాణ రంగంలో సుదీర్ఘ అనుభవం ఉందని చెబుతున్న అంబటి మురళీకృష్ణ అనుమతులు లేకుండా ఎలా నిర్మాణాలు చేపట్టారని నిలదీశారు. ఎన్నికల సమయంలో తనపై అనేకసార్లు అభూత కల్పనలతో అసత్య ప్రచారాలు చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాజకీయ కక్ష సాధింపులకు పొన్నూరులో తావులేదన్నారు. కానీ తనపై అక్రమ కేసులు పెట్టి జైలుకు పంపారని గుర్తు చేసుకున్నారు. ఎన్నికల సమయంలో తనను తిరిగి జైలుకు పంపుతామని అంబటి మురళీకృష్ణ ప్రచార వేదికలపై ప్రకటించి బెదిరింపులకు పాల్పడింది నిజం కాదా అన్ని ప్రశ్నించారు. కానీ తాను మాత్రం వినియోదారుల శ్రేయస్సే లక్ష్యంగా గ్రీన్ గ్రేస్ అపార్ట్‌మెంట్ అక్రమ నిర్మాణాలపై పోరాడుతున్నట్లు ఎమ్మెల్యే స్పష్టం చేశారు.

బగళాముఖి అమ్మవారికి ఎంపీ దంపతుల ప్రత్యేక పూజలు



ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు దంపతులను సత్కరిస్తున్న ఫెస్టివల్ అధికారి నరసింహమూర్తి

పిట్టలవానిపాలెం, అక్టోబరు 13: పిట్టలవానిపాలెం మండలం చందోలు గ్రామంలోని బగళాముఖి అమ్మవారి దేవస్థానంలో జరుగుతున్న దేవీశరన్నవరాత్రి మహోత్సవాల ముగింపు కార్యక్రమంలో భాగంగా జరుగుతున్న పూర్ణాహుతి కార్యక్రమానికి పల్నాడు జిల్లా నరసరావుపేట పార్లమెంట్ సభ్యుడు లావు శ్రీకృష్ణదేవరాయలు దంపతులు పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. దేవస్థానం కార్యనిర్వహణ కార్యదర్శి కె.నాగేశ్వరరావు, ఆలయ చీఫ్ ఫెస్టివల్ అధికారి జి.నరసింహమూర్తి వారికి హోమ ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించి దుశ్శాలువా, అమ్మవారి చిత్రపటాలతో ఘనంగా సత్కరించారు. తీర్థప్రసాదాలను అందజేశారు. కార్యక్రమంలో పలువురు పాల్గొన్నారు. ఎంపీ శ్రీకృష్ణదేవరాయలు దంపతులకు బగళాముఖి అమ్మవారి ఆలయ విశిష్టతను నాగేశ్వరరావు, నరసింహమూర్తి తెలియజేశారు.

రైళ్లు కిటకిట

● దసరా సెలవులు ముగియడంతో వేల మంది తిరుగు ప్రయాణం

● టిక్కెట్‌లు కన్‌ఫర్మ్ కాక పుట్‌బోర్డు వద్ద వేలాడుతూ జర్నీ

● ప్రీమియం తత్కాల్‌లోనూ బుకింగ్స్ పుల్



లింగంపల్లి ఇంటర్‌సిటీ ఎక్స్‌ప్రెస్ గుంటూరు రైల్వేస్టేషన్‌కు వచ్చిన సమయంలో ప్రయాణికుల రద్దీ

గుంటూరు, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): దసరా పండగ సెలవులు ముగియడంతో వేరే ఊళ్ల నుంచి వచ్చిన వారంతా ఆదివారం మధ్యాహ్నం నుంచి తిరుగు ప్రయాణమయ్యారు. దీంతో గుంటూరు రైల్వేజంక్షన్ మీదగా సికింద్రాబాద్, బెంగళూరు, చెన్నై, తిరువనంతపురం, విశాఖపట్నం, భువనేశ్వర్, హౌరా వెళ్లే రైళ్లన్నీ రద్దీగా మారాయి. వెయిటింగ్ లిస్టులు క్లియర్ కాకపోవడంతో గత్యంతరం లేని పరిస్థితుల్లో ప్రయాణికులు చాలామంది రైలు భోగీల పుట్‌బోర్డుపై వేలాడుతూ ప్రమాదకరరీతిలో బయలుదేరి వెళ్లారు. ముఖ్యంగా ఆదివారం సాయంత్రం విజయవాడ - లింగంపల్లి ఇంటర్‌సిటీ ఎక్స్‌ప్రెస్ గుంటూరు రైల్వేస్టేషన్‌కు వచ్చినప్పుడు కిక్కిరిసిపోయింది. ఆ రైలులో అప్పటికే విజయవాడ, మంగళగిరిలో ఎక్కిన ప్రయాణికులతో భోగీలన్ని నిండిపోగా ఇక్కడ వేలమంది ఎక్కడంతో కిటకిటలాడింది. మిగతా రైళ్లలోనూ ఇదే పరిస్థితి కనిపించింది.

ఎక్కువ ఛార్జీలు పెట్టి బుకింగ్..

దసర సందర్భంగా విద్యార్థులకు 10 రోజులు సెలవులు వచ్చాయి. ఉద్యోగులకు అయితే మూడు రోజులు సెలవులు(ఆదివారంతో కలుపుకొని) ప్రభుత్వం ఇచ్చింది. దీంతో ఇతర రాష్ట్రాల్లో విద్య, ఉద్యోగ, ఉపాధి రీత్యా ఉంటున్న వారంతా దసర పండగని సొంత ఊరిలో కుటుంబ సభ్యుల మధ్యన ఆనందంగా జరుపుకునేందుకు తరలివచ్చారు. పండగ శనివారం ముగిసింది. అయితే మాంసాహార వంటకాలను ఆదివారం ఆరగించి మధ్యాహ్నం 2 గంటల తర్వాత తిరుగు ప్రయాణమయ్యారు. సికింద్రాబాద్ వైపునకు విశాఖపట్నం - లింగంపల్లి జన్మభూమి ఎక్స్‌ప్రెస్‌తో రద్దీ మొదలైంది. ఆ తర్వాత వరుసగా నాగర్‌సోల్, నాందేడ్, సంత్రగచి స్పెషల్, నాగర్‌కోయిల్ - కాచీగూడ, ఇంటర్‌సిటీ (వయా వరంగల్), లింగంపల్లి ఇంటర్‌సిటీ, వందేభారత్ రైళ్లు బయలుదేరి వెళ్లాయి. ఇవికాక రాత్రి నరసపూర్, చెన్నై, నారయణాద్రి, డెల్టా, విశాఖ, కాకినాడ, మచిలీపట్నం స్పెషల్ రైళ్లు కూడా సికింద్రాబాద్‌కు వెళ్లాయి. వీటిల్లో ఏ ఒక్క దానిలోనూ రిజర్వుడ్ టిక్కెట్‌లు ఖాళీ లేవు. ప్రీమియం తత్కాల్ టిక్కెట్లను రెట్టింపు కంటే ఎక్కువ ఛార్జీలు పెట్టి బుకింగ్ చేసుకున్నారు.

ఒక్కటన్నా ప్రత్యేక రైలు ఉంటే..

మరోవైపు బెంగళూరు మార్గంలో రైళ్లు కూడా కిక్కిరిశాయి. ప్రశాంతి, హుబ్లీ, వాస్కోడిగామ, ధర్మవరం తదితర రైళ్లలోనూ వేల మంది ప్రయాణం చేశారు. ఇక సికింద్రాబాద్ నుంచి తిరువనంతపురంకు బయలుదేరి గుంటూరుకు వచ్చిన శబరి ఎక్స్‌ప్రెస్‌లో అడుగు తీసి అడుగు వేయడానికి ఖాళీ లేనంత రద్దీ తలెత్తింది. విశాఖపట్నంకు ఆదివారం మధ్యాహ్నం వెళ్లిన ఉదయ్ ఎక్స్‌ప్రెస్‌లోనూ ఖాళీలు లేకుండా ఏసీ సీట్లు అన్ని బుకింగ్ అయ్యాయి. రైల్వే శాఖ కొన్ని ప్రత్యేక రైళ్లను వేరే ప్రాంతాలకు ఏర్పాటు చేసి గుంటూరు మీదగా నడిపింది. దానివలన ఇక్కడి ప్రయాణికులకు పెద్దగా ఉపయోగం లేకుండా పోయింది. కనీసం ఒక్కటన్నా ప్రత్యేక రైలు గుంటూరు నుంచి సికింద్రాబాద్/బెంగళూరుకు ఏర్పాటు చేసి ఉంటే ప్రయాణికులకు మేలు జరిగేదన్న అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు.

ఉత్తమ ప్రదర్శనలుగా స్వేచ్ఛ నాటకం, చిగురుమేఘం నాటిక



ప్రముఖ రంగస్థల నటుడు గోపాలరావును సుబ్రహ్మణ్య శాస్త్రి పురస్కారంతో సత్కరిస్తున్న మాజీ మంత్రి ఆలపాటి

తెనాలి అర్బన్, అక్టోబరు 13 : కళల కాణాచి, వేద గంగోత్రి ఫౌండేషన్ సంయుక్తంగా నిర్వహించిన నాటకోత్సవాల్లో చిగురుమేఘం సాంఘిక నాటిక, స్వేచ్ఛ నాటకం ఉత్తమ ప్రదర్శనలుగా నిలిచాయి. తెనాలి రామకృష్ణ కవి కళాక్షేత్రంలో ఈ నెల 7న ప్రారంభమైన నాటక, నాటికల పోటీలు శనివారం ముగిశాయి. చెరుకుమల్లి సింగారావు అధ్యక్షతన నిర్వహించిన ముగింపు సభలో మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్ర ప్రసాద్ ముఖ్యఅతిథిగా పాల్గొని బహుమతులు అందజేశారు. ప్రముఖ రంగస్థల పౌరాణిక నటుడు యడ్ల గోపాలరావును బుర్రా సుబ్రహ్మణ్యశాస్త్రి రంగస్థల పురస్కారంతో ఘనంగా సత్కరించారు. సాంఘిక నాటికల విభాగంలో ఉత్తమ ప్రదర్శనగా చిగురుమేఘం, ద్వితీయ ఉత్తమ ప్రదర్శనగా నా శత్రువు, తృతీయ ఉత్తమ ప్రదర్శనగా మతమా-మానవత్వమా బహుమతులు అందుకున్నాయి. ఉత్తమ దర్శకునిగా హరిబాబు, సహాయ నటునిగా రవిబాబు, రంగాలంకరణలో రామ్మోహన్, ఆహార్యంలో రమణరావు, సంగీతంలో సాయితేజ, రచనలో తామేశ్వరయ్య, హాస్యనటునిగా పండు, ప్రతినాయకునిగా మంజునాథ, క్యారెక్టర్ నటిగా జ్యోతిర్మయి, క్యారెక్టర్ నటునిగా కృష్ణమూర్తి, ఉత్తమ నటిగా సురభి లలిత, ఉత్తమ నటునిగా కావూరి సత్యనారాయణ బహుమతులు అందుకున్నారు. సాంఘిక నాటకాల విభాగంలో ఉత్తమ ప్రదర్శనగా స్వేచ్ఛ, ద్వితీయ ఉత్తమ ప్రదర్శనగా మంత్రనగరి నాటకం బహుమతులు సాధించాయి. ఉత్తమ దర్శకునిగా డీఎం రెడ్డి, రంగాలంకరణలో దివాకర్ ఫణీంద్ర, ఆహార్యంలో థామస్, గాయకునిగా లీలా మోహన్, ఉత్తమ రచయితగా శివరామ్, సహాయ నటిగా మంజుభార్గవి, ప్రతినాయకునిగా రామారావు, క్యారెక్టర్ నటిగా కుసుమసాయి, నటునిగా బాలాజీనాయక్, ఉత్తమ నటిగా ప్రభావతి, నటునిగా గోవాడ వెంకట్ ఎంపికయ్యారు. విజేతలకు బుర్రా సాయిమాధవ్, ప్రవాస భారతీయుడు డాక్టర్ బాబు ఆర్ వడ్లమూడి, డబుల్ హార్స్ ఎండీ మునగాల శ్యాంప్రసాద్, వరప్రసాద్, జయలక్ష్మి, గరికపాటి సుబ్బారావు, ఆదినారాయణ, కె.సాంబశివరావు బహుమతులు అందజేశారు.

అవయవ దాన ఉద్యమం మరింత ముందుకు..



నియామక ఉత్తర్వులు అందుకుంటున్న రమణ యశస్వీ

గుంటూరు (మెడికల్) అక్టోబరు 13: ఆంధ్రప్రదేశ్ శరీర, అవయవ దాతల సంఘం రాష్ట్ర అధ్యక్షుడుగా గుంటూరు ప్రభుత్వ సమగ్రాస్పత్రి ఆర్థోపెడిక్ విభాగాధిపతి డాక్టర్ రమణ యశస్వీ బాధ్యతలు స్వీకరించారు. శనివారం నగరంలో జరిగిన కార్యక్రమంలో అఖిల భారత శరీర అవయవ దాతల సంఘం వ్యవస్థాపకురాలు, సావిత్రీబాయి పూలే ఎడ్యుకేషన్ ఛారిటబుల్ ట్రస్ట్ ఛైర్‌పర్సన్ గూడూరు సీతా మహాలక్ష్మి నియామక ఉత్తర్వులు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వైద్యుడుగా, కవిగా, రచయితగా, చిత్రకారుడుగా, వాక్ ఫౌండేషన్ వ్యవస్థాపకులుగా వైద్య, సాహిత్య సేవా రంగాల్లో తనదైన ముద్ర వేసిన డాక్టర్ రమణ యశస్వి ఆయా రంగాల్లో వందకుపైగా అవార్డులు అందుకోవడం ప్రశంసనీయమన్నారు. ఆయన నాయకత్వంలో రాష్ట్రంలో శరీర, అవయవదానం ఉద్యమం మరింత ముందుకు వెళ్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. డాక్టర్ రమణ యశస్వి మాట్లాడుతూ శరీర, అవయవదానం పట్ల ప్రజల్లో మరింత అవగాహన పెంచేందుకు పెద్దఎత్తున సదస్సులు నిర్వహిస్తామని తెలిపారు. అనంతరం సంఘం నూతన అధ్యక్షుడుగా నియమితులైన డాక్టర్ రమణ యశస్విని ఛైర్‌పర్సన్ గూడూరు సీతా మహాలక్ష్మి శాలువాతో సత్కరించారు.

వైసీపీ అరాచక శక్తుల ఆగడాలపై చర్యలు తీసుకోవాలి

● రెండు రోజులుగా నిరవధిక నిరాహార దీక్ష



గుంటూరులో ఆమరణ నిరాహార దీక్ష చేస్తున్న కోపూరి లక్ష్మి, తెలుగు మహిళలు

గుంటూరు, అక్టోబరు 13: గత వైసీపీ పాలనలో జరిగిన అరాచకాలు, ఆగడాలపై చర్యలు తీసుకోవాలని కోరుతూ గుంటూరుకు చెందిన ఆదర్శ మహిళా మండలి అధ్యక్షురాలు కోపూరి లక్ష్మి స్వీయ గృహ నిర్బంధ నిరవధిక నిరాహార దీక్షకు దిగారు. విజయదశమి పండగ రోజున ప్రారంభించిన నిరవధిక నిరాహార దీక్ష రెండో రోజుకు చేరుకుంది. వైసీపీ ప్రభుత్వ హయాంలో రాష్ట్ర వ్యాప్తంగా దళితులు, ప్రతిపక్షాలపై దాడులు, అఘాయిత్యాలు, భూకబ్జాలు, అక్రమ కేసులు వంటి అరాచకాలను నిరసిస్తూ ఆమె గత ఎన్నికలకు ముందు ఏప్రిల్ 20న దేశ రాజధాని ఢిల్లీలో బొటనవేలు నరుక్కొని నిరసన వ్యక్తం చేశారు. ఈ సాహస నిరసన కార్యక్రమం అప్పట్లో దేశవ్యాప్తంగా చర్చనీయాంశమైంది. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నేపథ్యంలో నాటి వైసీపీ అరాచకాలపై చర్యలు తీసుకుంటారని ఆమె భావించారు. అయితే నెలలు గడుస్తున్నా ఎటువంటి చర్యలు తీసుకోకపోవడంతో ఆమె ఇటీవల సీఎం చంద్రబాబును స్వయంగా కలసి వైసీపీ అరాచకాలపై విచారణ జరిపి తగిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. తాను నివాసం ఉంటున్న గుంటూరు రూరల్ మండలంలోని కృష్ణతులసి నగర్ తోపాటు స్వర్ణభారతి నగర్, స్వర్ణాంధ్ర నగర్, జన్మభూమి నగర్ తదితర ప్రాంతాల్లో వైసీపీ నాయకులు, రౌడీలు గత ఐదేళ్లలో అరాచకాలు, అఘాయిత్యాలు, భూకబ్జాలకు పాల్పడ్డారని, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత కూడా వారి ఆగడాలు తగ్గలేదని, విచారణ జరిపి తగు చర్యలు తీసుకోవాలని ఆమె చంద్రబాబుకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. దీనిని మనసులో పెట్టుకున్న వైసీపీ వర్గీయులు, రౌడీషీటర్లు వివిధ కేసుల్లో పాత నేరస్తులు తమపై హత్యాయత్నానికి పాల్పడ్డారని ఆమె పేర్కొన్నారు. వీటన్నింటిపై విచారణ జరిపి నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని, లేని పక్షంలో తాను ప్రాణ త్యాగానికైనా సిద్ధమేనని ఆమె ప్రకటించారు. పలువురు టీడీపీ మహిళలు మద్దతు ప్రకటించి దీక్షలో కూర్చున్నారు.

ముగిసిన మంగళగిరి కబడ్డీ లీగ్ పోటీలు

● పురుషుల విజేత తూర్పు గోదావరి జట్టు

● మహిళల విజేత విజయనగరం జట్టు



విజేతగా నిలిచిన విజయనగరం మహిళల జట్టుకు ట్రోఫీ అందజేస్తున్న టీడీపీ నాయకులు

మంగళగిరి సిటీ, అక్టోబరు 13: రాష్ట్ర విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ సహకారంతో నిర్వహించిన మంగళగిరి కబడ్డీ లీగ్-2024 పోటీలు విజయవంతంగా ముగిశాయి. మంగళగిరి బీఎండబ్ల్యూ షోరూమ్ పక్కన గల మైదానంలో ప్రైడ్ ఆఫ్ మంగళగిరి పేరిట నిర్వహించిన పోటీలు నాలుగు రోజులపాటు క్రీడాభిమానులను అలరించాయి. పురుషులు, మహిళలకు వేర్వేరుగా జరిగిన ఈ లీగ్‌లో ఫైనల్ మ్యాచ్‌లు ఉత్కంఠభరితంగా సాగాయి. పురుషుల విభాగం ఫైనల్ మ్యాచ్‌లో కృష్ణా జట్టుపై తూర్పు గోదావరి జట్టు 15-18 పాయింట్ల తేడాతో గెలుపొందింది. కృష్ణా జట్టు ద్వితీయ స్థానం, గుంటూరు జట్టు తృతీయ స్థానంలో నిలిచాయి. మహిళల విభాగం ఫైనల్ మ్యాచ్‌లో కృష్ణా జట్టుపై విజయనగరం జట్టు 8-31 పాయింట్ల తేడాతో ఘనవిజయం సాధించింది. కృష్ణా జట్టు ద్వితీయ స్థానం, చిత్తూరు జట్టు తృతీయ స్థానంలో నిలిచాయి. విజేతలకు టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు ట్రోఫీలు, నగదు బహుమతులను అందజేశారు.

బహుమతులు అందజేత

మంత్రి నారా లోకేశ్ స్ఫూర్తితో కబడ్డీ పోటీలకు ఈవెంట్ స్పాన్సర్‌గా మురళీకృష్ణ యార్లగడ్డ (మార్క్‌రోస్) వ్యవహరించారు. పురుషుల విభాగంలో విజేతగా నిలిచిన తూర్పు గోదావరి జట్టుకు జవ్వాది కిరణ్‌చంద్ రూ.లక్ష, ద్వితీయ స్థానంలో నిలిచిన కృష్ణా జట్టుకు నందం అబద్దయ్య రూ.75 వేలు, తృతీయ స్థానంలో నిలిచిన గుంటూరు జట్టుకు గద్దె శ్రీనివాసరావు, జంపాల సుబ్బారావు రూ.50 వేల చొప్పున నగదు బహుమతులను అందజేశారు. మహిళల విభాగంలో విజేతగా నిలిచిన విజయనగరం జట్టుకు ఆవల రవికిరణ్ రూ.లక్ష, ద్వితీయ స్థానంలో నిలిచిన కృష్ణా జట్టుకు గాజుల శ్రీనివాసరావు రూ.75 వేలు, తృతీయ స్థానంలో నిలిచిన చిత్తూరు జట్టుకు గూడూరు వెంకట్రావు సహకారంతో రూ.50 వేల నగదు బహుమతులను అందజేశారు. టీడీపీ పట్టణ ప్రధాన కార్యదర్శి షేక్ రియాజ్ సహకారంతో ప్రతిరోజు సాయంత్రం అల్పాహారం అందజేశారు. బహుమతి ప్రదానోత్సవంలో ఏపీ పద్మశాలి వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్ నందం అబద్దయ్య, జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి చిల్లపల్లి శ్రీనివాసరావు, టీడీపీ గుంటూరు పార్లమెంటు ప్రధాన కార్యదర్శి పోతినేని శ్రీనివాసరావు మాట్లాడుతూ క్రీడలకు కూటమి ప్రభుత్వం ఎంతగానో ప్రాధాన్యం, ప్రోత్సాహాన్ని అందిస్తుందని అన్నారు. యువతను క్రీడల వైపు ప్రోత్సహించాలన్న లక్ష్యంతో మంత్రి నారా లోకేశ్ ప్రతిఏటా వివిధ రకాల టోర్నమెంట్లు నిర్వహించడంతోపాటు తాడేపల్లి, మంగళగిరి ప్రాంతాల్లో క్రీడా ప్రాంగణాలను ఏర్పాటు చేశారని తెలిపారు. మంగళగిరిని క్రీడా హబ్‌గా తీర్చిదిద్దడంతోపాటు జాతీయ, అంతర్జాతీయ వేదికలపై క్రీడాకారులు రాణించడమే లక్ష్యంగా మంత్రి లోకేశ్ కృషి చేస్తున్నారని చెప్పారు. కబడ్డీ పోటీలను విజయవంతంగా నిర్వహించిన నిర్వాహకులను, ఆంధ్రా కబడ్డీ అసోసియేషన్ సెక్రెటరీ యలమంచిలి శ్రీకాంత్‌ను, ఎంటీఎంసీ అధికారులు, పోలీసు సిబ్బంది, క్రీడా మైదానాన్ని ఇచ్చిన బీఎండబ్ల్యూ యాజమాన్యాన్ని అభినందించారు.

అంతర్జాతీయ వేదికపై సత్తా చాటిన సాదియా

● కామన్వెల్త్ పవర్ లిఫ్టింగ్‌లో స్వర్ణ పతకం కైవసం



పతకాలతో సాదియా అల్‌మాస్

మంగళగిరి సిటీ, అక్టోబరు 13: అంతర్జాతీయ వేదికపై మంగళగిరికి చెందిన పవర్ లిఫ్టర్ సాదియా అల్‌మాస్ మరోమారు సత్తా చాటారు. ఈ నెల 4 నుంచి 13వ తేదీ వరకు దక్షిణాఫ్రికాలోని సన్‌సిటీలో జరిగిన కామన్వెల్త్ పవర్ లిఫ్టింగ్ పోటీల్లో స్వర్ణ పతకం కైవసం చేసుకున్నారు. సాదియా అల్‌మాస్ 57 కిలోల జూనియర్స్ విభాగం స్క్వాట్‌లో 185 కిలోల బరువును ఎత్తి స్వర్ణం, బెంచ్‌ప్రెస్‌లో 95 కిలోల బరువును ఎత్తి స్వర్ణం, డెడ్‌లిఫ్ట్‌లో 180 కిలోల బరువును ఎత్తి స్వర్ణం సాధించడంతోపాటు ఓవరాల్‌గా 460 కిలోల బరువును ఎత్తి బంగారు పతకాన్ని సొంతం చేసుకున్నారు. కామన్వెల్త్ జూనియర్స్ 57 కిలోల విభాగంలో ఈ ఘనత సాధించిన గుంటూరు జిల్లా లిఫ్టర్‌గా సాదియా చరిత్ర సృష్టించారు. పతకాలు సాధించిన సాదియా అల్‌మాస్‌ను రాష్ట్ర ఐటీ, విద్యా శాఖల మంత్రి నారా లోకేశ్ ప్రత్యేకంగా అభినందించారు. పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ సౌత్ ఇండియా ఆర్గనైజింగ్ సెక్రటరీ సకల కోటేశ్వరరావు, ఏపీ అధ్యక్షుడు గంటా వెంకటేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి సకల సూర్యనారాయణ, గుంటూరు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కొమ్మాకుల విజయ భాస్కరరావు, షేక్ సందాని తదితరులు సాదియాకు అభినందనలు తెలియజేశారు.

సమస్యలు పరిష్కరించే వారికే మద్దతు



షేక్ అబ్దుల్ రజాక్

గుంటూరు సిటీ, అక్టోబరు 13: గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించే వారికే పట్టభద్రుల శాసన మండలి ఎన్నికల్లో తాము మద్దతు నిస్తామని ఆంధ్రప్రదేశ్ గ్రామ, వార్డు సచివాలయ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు షేక్ అబ్దుల్ రజాక్ అన్నారు. ఆదివారం ఆయన గుంటూరులో విలేకరులతో మాట్లాడుతూ సచివాలయ ఉద్యోగులు అనేక సమస్యలతో సతమతం అవుతున్నారని అన్నారు. సచివాలయ ఉద్యోగుల గొంతుకను శాసనమండలిలో వినిపించే అభ్యర్థికి మాత్రమే సచివాలయ ఉద్యోగులు అండగా ఉంటామని తెలిపారు. పట్టభద్రుల స్థానానికి ఎన్నికలు జరిగే జిల్లాల్లో సుమారు 40 వేల మందికిపైగా సచివాలయ ఉద్యోగులు గ్రాడ్యుయేట్లుగా ఉన్నారని, వీరందరూ ఓటు కు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. ఉమ్మడి తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి, గుంటూరు, కృష్ణ జిల్లాల్లో జరగబోవు పట్టభద్రుల శాసన మండలి ఎన్నికల కొరకు ఆయా జిల్లాల్లోని పట్టభద్రులు, సచివాలయ ఉద్యోగులు ఫామ్ 18 దరఖాస్తు ద్వారా ఓటు నమోదు చేసుకోవాలని అబ్దుల్ రజాక్ సూచించారు.

సూర్యలంక తీరానికి పోటెత్తిన పర్యాటకులు



సూర్యలంక సముద్రతీరంలో స్నానాలను ఆచరిస్తున్న పర్యాటకులు

బాపట్ల రూరల్, అక్టోబరు 13: దసరా సెలవుల్లో ఆఖరిరోజు ఆదివారం కావటంతో బాపట్ల మండలం సూర్యలంక సముద్ర తీరానికి పర్యాటకులు పోటెత్తారు. రెండు తెలుగు రాష్ట్రాల నుంచి పర్యాటకులు సూర్యలంక సముద్ర తీరానికి అధిక సంఖ్యలో వచ్చారు. యువకులు తీరంలో కేరింతలు కొడుతూ సముద్ర స్నానాలు చేయగా, చిన్నారులు తీరం ఒడ్డున ఇసుక తిమ్మెలతో ఆడుకుంటూ ఆహ్లాదకరంగా గడిపారు. పర్యాటకులు కుటుంబ సమేతంగా సముద్ర స్నానాలు ఆచరించిన అనంతరం తీరం సమీపంలోని జీడిమామిడి తోటల వద్ద, తోటలు కింద వనభోజనాలు చేస్తూ సంతోషంగా గడిపారు. తీరం ఒడ్డున ఎటువంటి ఘటనలు జరగకుండా బాపట్ల రూరల్, మెరైన్ పోలీసులు, గజ ఈతగాళ్లు గస్తీని నిర్వహించారు.

నందిగం అనుచరులు అరెస్టు.. విడుదల

తుళ్లూరు, అక్టోబరు 13: ఎన్నికల కౌంటింగ్ రోజు కూటమి ప్రభుత్వం గెలిచిందని ఉద్దండ్రాయుపాలెంకు చెందిన దళిత జేఏసీ నేత పులి చిన్నా(మరియదాసు)సంబరాలు చేస్తుంటే అతనిపై మాజీ ఎంపీ నందిగం సురేశ్ ఆధ్వర్యంలో ఎనిమిది మంది అనుచరులు దాడి చేశారు. ఘటనపై ఈ ఏడాది జులై 8న తుళ్లూరు పోలీసు స్టేషన్‌లో బాధితుడు చిన్నా నందిగం ప్రధాన నిందితుడిగా అనుచరులపై ఫిర్యాదు చేశారు. అప్పటి తుళ్లూరు సీఐ సుభాని నందింగంతోపాటు అనుచరులపై కేసు నమోదు చేశారు. ప్రస్తుతం ఒక మర్డర్ కేసులో గుంటూరు జిల్లా జైలులో నందిగం సురేశ్ రిమాండ్ ఖైదీగా ఉన్నారు. పులి చిన్నా కేసు దర్యాప్తులో భాగంగా శనివారం నందిగం అనుచరులు ఐదుగురిని అరెస్టు చేసి స్టేషన్ బెయిల్‌పై విడుదల చేశారు. తనపై హత్యాయత్నం చేసిన వారిపై చిన్న కేసు నమోదు చేసి స్టేషన్ బెయిల్ ఇవ్వడం ఏమిటని బాధితుడు పులి చిన్నా ఆవేదన వ్యక్తం చేశారు.

రోడ్డు ప్రమాదంలో బాలిక మృతి

సత్తెనపల్లి, అక్టోబరు 13: రోడ్డు ప్రమాదంలో బాలిక మృతి చెందిన సంఘటన సత్తెనపల్లి మండలం లక్కరాజుగార్లపాడులో ఆదివారం జరిగింది. లక్కరాజుగార్లపాడు గ్రామానికి చెందిన జొన్నలగడ్డ కోటేశ్వరరావు కుమార్తె కావ్య(14) తన పెద్దమ్మ కుమారుడైన మీసాల వంశీతో కలసి స్కూటీపై ఫిరంగిపురం మండలం వెళ్తుండగా లక్కరాజుగార్లపాడు గ్రామం దాటగానే స్కూటీని ట్రాక్టర్ ఢీకుంది. దీంతో తీవ్ర గాయాలైన కావ్యను, వంశీని చికిత్స నిమిత్తం బంధువులు, కుటుంబ సభ్యులు సత్తెనపల్లి ఏరియా వైద్యశాలకు తరలించారు. అప్పటికే కావ్య మృతి చెందింది. వంశీకి తీవ్ర గాయాలు కావటంతో ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన చికిత్స నిమిత్తం గుంటూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. కావ్య తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చెరువులో ఈతకి దిగి కూలీ మృతి

తుళ్లూరు అక్టోబర్ 13: చెరువులో దూకి వలస కూలీ మృతి చెందిన ఘటన మండల కేంద్రం తుళ్లూరులో శనివారం సాయంత్రం జరిగింది. శ్రీకాకుళం జిల్లాకు చెందిన రామకృష్ణ అలియాస్ రాజు(39) పదేళ్లగా తుళ్లూరులో తాపీ వర్కర్‌గా పని చేస్తున్నాడు. గత రెండేళ్ల నుంచి తుళ్లూరులోని ఐనచెరువుకి చెందిన రాంబాబు అనే మేస్త్రీ ఇంట్లోనే ఉంటూ, అతని వద్దే పని చేస్తున్నాడు. శనివారం మద్యం మత్తులో చెరువులో ఈతకు దిగాడని స్థానికులు చెబుతున్నారు. ఈత వచ్చినప్పటికీ ఫుల్‌గా మద్యం తాగి ఉండటంతో మునిగిపోయాడు. అక్కడ వారు గమనించి చెరువులో గాలించారు. అయినా ప్రయోజనం కలగలేదు. ఎన్డీఆర్ఎఫ్ బృందాలు గాలించినా మృతుడి ఆచూకీ లభ్యం కాలేదు. తెల్లవారిన తరువాత రామకృష్ణ మృతదేహం చెరువు మధ్యలో తేలింది. బంధువులకు మేస్త్రీ రాంబాబు సమాచారం ఇచ్చారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కుడి కాలువలో పడి వ్యక్తి మృతి

మాచర్ల రూరల్, అక్టోబరు 13: మద్యం మత్తులో కుడి కాలువలో పడి యువకుడు మృతి చెందిన సంఘటన శనివారం రాత్రి జరిగింది. విజయపురిసౌత్ పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. పట్టణంలోని ఒకటో వార్డుకు చెందిన గోగుల శివశంకర్ జేసీబీ డ్రైవర్‌గా జీవనం సాగిస్తున్నాడు. శనివారం సాయంత్రం స్నేహితులతో కలిసి ద్విచక్ర వాహనాలపై పైలాన్ వెళ్లి ఫూటుగా మద్యం తాగారు. తిరిగి వస్తూ ద్విచక్ర వాహనంపై వెనుక కూర్చున్న శివశంకర్ మార్గమధ్యలో వాహనం నడుపుతున్న వ్యక్తిపై వాంతులు చేసుకున్నాడు. వీరు దుస్తులు కడుక్కునేందుకు మండలంలోని తాళ్లపల్లి కుడి కాలువ వద్ద ఆగారు. కాలువలోకి దిగి దుస్తులు కడుక్కుంటుండగా శివశంకర్ మద్యం మత్తులో కాలువలో పడిపోయాడు. కాగా మృతదేహం ఆదివారం తాళ్లపల్లి బ్రిడ్జి వద్ద లభ్యమైంది. విజయపురిసౌత్ పోలీసులు మృతదేహాన్ని బయటకు తీసి పోస్టుమార్టం నిమిత్తం మాచర్ల పట్టణంలోని ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. మృతుడి బాబాయి శివ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతునికి భార్య శిరీష, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

పులిచింతల సమాచారం

అచ్చంపేట, అక్టోబరు 13 : పులిచింతల ప్రాజెక్టులో ఆదివారం 42.16 టీఎంసీల నీటి నిల్వ ఉన్నట్లు పులిచింతల ప్రాజెక్టు ఏఈ రాజు తెలిపారు. ఎగువ నుంచి 33,516 క్యూసెక్కుల నీరు ప్రాజెక్టుకు చేరుతుందన్నారు. ప్రాజెక్టు వద్ద 30,225 క్యూసెక్కుల నీరు దిగువ కృష్ణకు విడుదల అవుతుందని తెలిపారు. వీటిలో 16 వేల క్యూసెక్కుల నీరు పవర్ జనరేషన్ ద్వారా దిగువ కృష్ణకు వస్తున్నాయి.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.25 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	128, 138,148
చికెన్ విత్ స్కిన్	240.00
చికెన్ స్కిన్ లెస్	250.00



ఎస్‌వీఎన్ కాలనీలోని వేంకటేశ్వర దేవాలయంలో శ్రీ రాజరాజేశ్వరీ దేవిగా అమ్మవారు

వైభవంగా దసరా మహోత్సవాలు

● కోలాహలంగా అమ్మవారి ఉత్సవ విగ్రహాల ఊరేగింపు

● ముగిసిన దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు



శ్రీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఉత్సవ విగ్రహం

గుంటూరు, అక్టోబరు 13: జగన్మాత, శ్రీ కనకదుర్గ అమ్మవారి దేవీ శరన్నవరాత్రి మహోత్సవాలు అత్యంత వైభవోపేతంగా ముగిశాయి. దసరా మహోత్సవాలు జిల్లా వ్యాప్తంగా అంగరంగ వైభవంగా నిర్వహించారు. జిల్లా కేంద్రం గుంటూరుతో పాటు తెనాలి, మంగళగిరి, పొన్నూరు వంటి పట్టణాల్లో వైభవంగా దసరా మహోత్సవాలు చేశారు. ఈ సందర్భంగా తొమ్మిది రోజుల పాటు పూజలందుకున్న అమ్మవారి ఉత్సవ విగ్రహాలను పురవీధుల్లో ఊరేగింపు నిర్వహించారు. జిల్లా వ్యాప్తంగా ఆలయాలలో ఉదయం నుంచే భక్తుల రద్దీ కనిపించింది. తెల్లవారుజాము నుంచే ప్రత్యేక పూజలు ప్రారంభించారు. భక్తుల రద్దీకి అనుగుణంగా ప్రత్యేక క్యూ లైన్‌లను ఏర్పాటు చేశారు. జిల్లాతో పాటు రాష్ట్రంలోనే ప్రసిద్ధి చెందిన శ్రీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆలయంలో నవరాత్రి మహోత్సవాలు ముగింపులో భాగంగా శనివారం పురవీధుల్లో ఊరేగింపు వైభవంగా నిర్వహించారు. ఇందుకోసం రాష్ట్రంతో పాటు కేరళ, తమిళనాడు ఇతర రాష్ట్రాల నుంచి కళాకారులతో బాణసంచా కాల్చారు. సంగడిగుంటలోని శ్రీకనకదుర్గమ్మ ఆలయం ఎదుట ప్రత్యేక టార్పాలిన్ పట్టాలతో నీటి కొలను చేసి అమ్మవారి ఉత్సవిగ్రహంతో తెప్పోత్సవం నిర్వహించారు. చుట్టుగుంట పోలేరమ్మ తల్లి ఆలయంలో మహోత్సవాలు నిర్వహించారు. నిర్వాహకులు శనివారం ఆలయం ఎదుట పెద్ద ఎత్తున అన్నప్రసాద వితరణ చేశారు. అరండల్‌పేటలోని అష్టలక్ష్మీదే వాలయం, విద్యానగర్, బ్రాడీపేట మెయిన్ రోడ్డులోని కోదండరామాలయం బృందావన్‌గార్డెన్స్ లోని శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయాల్లో శ్రీ దేవీ శరన్నవరాత్రి మహోత్స వాలు నిర్వ హించారు. ఆయా కార్యక్రమాల్లో ఉత్సవ కమిటీ చైర్మన్ ఈరంటి వర ప్రసాద్ (సిటీ బస్ బాబు), కొనకళ్ళ సత్యం, కోట శేషగిరి, నేరెళ్ళ హరిప్రసాద్, కారంశెట్టి లోకేష్, రాంబాబు, టీఎల్‌వీ వీరాంజనేయులు, దేవరశెట్టి సురేష్, ఆలయ కమిటీ అధ్యక్ష, ఉపాధ్యక్షులు మారెడ్డి శ్రీనివాసరెడ్డి, మద్దిరెడ్డి జగన్మోహన్‌రెడ్డి, మూరబోయిన నరసింహారావు, మల్లం సత్యనారాయణ, అరవ ఆంజనేయులు, పత్రి అప్పారావు, కొండముడి శ్రీనివాసరావు, శ్రీనివాసరెడ్డి తదితరులు ఉన్నారు.

● కిటకిటలాడిన అమ్మవారి ఆలయాలు

గుంటూరు(తూర్పు), అక్టోబరు 13: విజయదశమి పర్వదినాన్ని నగరంలో వైభవంగా జరుపుకున్నారు. వేకువజామునుంచే ఆల యాలకు భక్తులు పోటెత్తారు. దీంతో ఆలయాలు కిట, కిట లాడాయి. ఆలయ ఉత్సవ కమిటీల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసి ప్రత్యేక మండపాల్లో అమ్మవారికి విశేషంగా అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారికి విశేష అభిషేకాలు, అర్చనలు, అలంకరణలు జరిగాయి. గో పూజ, సువాసిని, కుమారి పూజలు సువాసినులచే సామూహిక కుంకుమార్చనలు భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. పలు దేవాలయాల్లో అమ్మవారిని శ్రీ రాజరాజేశ్వరి దేవిగా అలంకరించారు. సామూహిక తులసి పూజలు, మహావిద్య హోమం, సహస్ర నామార్చనలు నిర్వహించారు. పలు దేవాలయాల వద్ద అన్నదాన వితరణ జరిగింది. ఆయా దేవాలయాల వద్ద ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలు జరిగాయి. సాయంత్రం అమ్మవారి గ్రామోత్సవాలు కనుల పండుగా నిర్వహించారు. అనంతరం అమ్మవారి వస్త్రాలకు వేలంపాట నిర్వహించారు.

భక్తి శ్రద్ధలతో సాయినాథ సమాధి మహోత్సవం



సాయినాథునికి పూజలు చేస్తున్న భక్తులు

గుంటూరు(తూర్పు), అక్టోబరు 13: విజయదశమిని పురస్కరించుకుని స్థానిక విద్యానగర్ 3వ లైన్‌లోని శ్రీ సాయినాథ సన్నిధానంలో సాయినాధ సమాధి మహోత్స వం భక్తి శ్రద్ధలతో జరిగింది. ఉదయం కాకడ హారతి, పంచామృతాభిషేకాలు నిర్వ హించారు. చందనార్చన అనంతరం దీపోత్సవం, సమాధిపూజ, సమాధి హారతి జరిగాయి. అనంతరం అన్నదాన వితరణ జరిగింది. కార్యక్రమంలో సన్నిదాన గౌరవాధ్యక్షుడు వై.ఆశోక్ కుమార్, అధ్యక్షుడు వి.శివరామకృష్ణయ్య, వై.స్వరూపరాణి, ఎం.సంజీవరావు పాల్గొన్నారు.



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న జూపూడి, బిక్షం తదితరులు

19న 'ఎర్రచెరువును కాపాడుకుందాం' బహిరంగసభ

గుంటూరు, అక్టోబరు 13: గుంటూరు టౌన్ రజక జన సేవా సంఘం ఆధ్వర్యంలో ఈనెల 19న 'ఎర్ర చెరువును కాపాడుకుందాం' అనే పేరుతో బహిరంగసభ నిర్వహించనున్నట్లు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రజక జన సేవా సంఘం ప్రధాన కార్యదర్శి జూపూడి శ్రీనివాసరావు తెలిపారు. పాతగుంటూరులో ఆదివారం గంగానమ్మ కమ్యూనిటీ హాల్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాతగుంటూరు, చిన్నబజారు, గంజిబజారు, లాలాపేట, పొత్తూరువారితోట ప్రాంతాల్లో రజక వృత్తి చేసుకొనే వారు దశాబ్దాలుగా పోరాడి రక్తం ధార పోసి ఎర్రచెరువును సాధించుకున్నారన్నారు. కొందరు స్వార్ధపరులు తమ ఇంటి అడ్రస్‌ల పేరుతో రజక సంఘాలు ఏర్పాటు చేసుకొని వృత్తిదారులకు ద్రోహం చేసేలా వ్యవహరిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఇటీవల జరిగిన అనేక పరిణామాలపై సభలో చర్చించి తీర్మానాలు చేయటం జరుగుతుందన్నారు. నగరంలో ప్రముఖులను ఆహ్వానించనున్నట్లు పేర్కొన్నారు. సమావేశంలో జిల్లా నాయకులు వట్టికూటి సాంబయ్య, మహిళా ప్రధాన కార్యదర్శి పెనుమాక రమాదేవి, గుంటూరు టౌన్ రజక జన సేవా సంఘం కమిటీ సభ్యులైన చాగంటిపాటి వెంకటేశ్వర్లు, కట్టవరపు వీరాస్వామి, తాటినాడ రాము, లింగాల బిక్షం, లింగాల పిచ్చేశ్వరరావు, పిడుగురాళ్ల సురేష్ బాబు తదితరులు పాల్గొన్నారు.

ఆనందపేటలో డ్రెయిన్ సమస్యను తక్షణం పరిష్కరించాలి

● 11వ డివిజన్‌లో పర్యటించిన ఎమ్మెల్యే నషీర్

గుంటూరు, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కారానికి తాను ఎప్పుడూ అందుబాటులో వుం టానని ఎమ్మెల్యే నషీర్ తెలిపారు. గుంటూరు తూర్పు నియో జకవర్గం 11వ డివిజన్‌లో ప్రజా సమస్యలపై శనివారం ఆయన పలు చర్యలు చేపట్టారు. జోరు వర్షంలో కూడా ప్రజల మధ్యలోకి వెళ్లిన ఆయన స్థానికుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ స్థానిక ఆనందపేటలోని డ్రెయిన్ సమస్యను పరిశీలించి, తక్షణమే వాటిని పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. వార్డులో రోడ్లు, డ్రెయిన్ల సమస్యలను త్వరలోనే పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

తక్కువ ధరకే నిత్యావసరాల పంపిణీ

ముఖ్యమంత్రి చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం పేదల అవసరాలను దృష్టిలో పెట్టుకొని నిత్యావసరాల ధరలను తగ్గించి అందిస్తోందని ఎమ్మెల్యే మహమ్మద్ నసీర్ అన్నారు. పౌర సరఫరాల శాఖ ఆధ్వర్యంలో చౌక ధరల్లో నూనెలు అందిం చేందుకు ఏర్పాటు చేసిన షాపులను శనివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లా డుతూ ప్రస్తుతం బహిరంగ మార్కెట్‌లో కిలో పామాయిల్ ప్యాకెట్ రూ.125కు, సన్‌ఫ్లవర్ ఆయిల్ కిలో ప్యాకెట్ రూ.138 అమ్ముతున్నా రని, ప్రభుత్వం ఆయా నూనెలను వరుసగా రూ.110, రూ.124కు అందిస్తోందని అన్నారు. గత ప్రభుత్వ హయాంలో రేషన్ షాపులను కేవలం బియ్యం షాపులుగా మార్చిందని విమర్శించారు. రేషన్ షాపుల ద్వారా బియ్యం, పంచదార, కందిపప్పు, పామాయిల్, సన్‌ఫ్లవర్ ఆయిల్



11వ డివిజన్‌లో డ్రెయిన్ల దుస్థితిపై ఆరా తీస్తున్న ఎమ్మెల్యే నసీర్

ఇప్పటికే అందిస్తున్నా మని, త్వరలో గోధుమలు సహా ఇతర నిత్యావసరాలనూ తక్కువ ధరకే తమ ప్రభుత్వం అందిస్తుందని చెప్పారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల సంఖ్య పెంపు, కనీస మద్దతు ధర, సబ్సిడీపై టార్పాలిన్ పట్టాలను అందించాలనే విష యాల గురించి ఆయన ప్రస్తావించారు. గత ప్రభుత్వం ధాన్యం కొనుగోలుకు సంబంధించి చెల్లించాల్సి ఉన్న కోట్ల రూపాయల బకాయిలను కూటమి ప్రభుత్వం చెల్లించిందని అన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ అశోక్, రబ్బానీ, హుస్సేన్,జే.శ్రీనివాస్,అన్వర్,నాగిరెడ్డి, రహమతున్నిసా పాల్గొన్నారు



తండ్రి శవయాత్రలో కూతురు జాహ్నవి

కూతురే .. తలకొరివి



తండ్రి మృతదేహానికి తలకొరివి పెడుతున్న కుమార్తె జాహ్నవి

గుంటూరు సిటీ, అక్టోబరు 13 : 'పున్నామ నరకం నుండి రక్షించు వాడు.. పుత్రుడు' అని నమ్మకం. కొడుకులు లేని, పెళ్ళిళ్ల కానీ కుమార్తెలు మాత్రమే ఉన్న తండ్రులకు అంత్యక్రియలు నిర్వ హించేందుకు ఎవరూ ముందుకు రాని సంఘటనలు ఉన్నాయి. కుమార్తే ఆ బాధ్యతను తన భుజస్కంధాలపై వేసుకుని అంతిమ సంస్కారం నిర్వహించిన ఘటనలూ లేకపోలేదు. ఇటువంటి సంఘటనే శనివారం గుంటూరు సమీపంలోని గోరంట్లలో జరిగింది. సుమారు 54 ఏళ్ల వయసు గల మేరావత్ బాబ్జీ నాయక్ గోరంట్ల నివాసి. పిడుగురాళ్లలో విద్యుత్ శాఖ ఏడీఈగా పని చేస్తున్నారు. శుక్ర వారం రాత్రి ఆయనకు గుండెపోటు రావడంతో మృతి చెందారు. అయితే, బాబ్జీ నాయక్‌కు ముగ్గురు కుమార్తెలు. వారు చదువు కుంటున్నారు. బాబ్జీ నాయక్‌కు మృతదేహానికి అంత్యక్రియలు నిర్వహించేందుకు వారి బంధువులు ఎవరూ ముం దుకు రాని పరిస్థితి. దీంతో, బాబ్జీ నాయక్ పెద్ద కుమార్తె జాహ్నవి తన తండ్రి భౌతికకాయానికి కర్మకాండల తంతు నిర్వహించి, శనివారం ఆయన భౌతికకాయానికి తలకొరివి పెట్టింది. బిడ్డలను కంటికి రెప్పగా కాపాడుకునే తండ్రి మృతి చెందడం, అంతిమ సంస్కారం చేయాల్సి వచ్చిన కూతురుని చూసిన పలువురు చలించిపోయారు.

వైసీపీ హయాంలో పంచాయతీలు దివాళా: డేగల



మాట్లాడుతున్న ప్రభాకర్


గుంటూరు, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): వైసీపీ విధ్వంస పాలనలో గ్రామ పంచాయతీ వ్యవస్థ నిర్వీర్యమైందని, గ్రామ పంచాయతీలన్నీ దివాళా తీశాయని తెలుగు దేశం పార్టీ గుంటూరు నగర అధ్యక్షుడు డేగల ప్రభాకర్ విమర్శించారు. టీడీపీ నగర కార్యాలయంలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. రాష్ట్ర వ్యాప్తంగా ఈ నెల 14వ తేదీ నుంచి పల్లె పండుగ వారోత్సవాలు నిర్వహించనున్నారని. 13,324 గ్రామాల్లో ఒకేసారి ఈ వారోత్సవాలు ప్రారంభం కానున్నాయని తెలిపారు. గ్రామాల్లో రోడ్లు, మురుగుకాలువలు, తాగునీరు వంటి సమస్యల పరిష్కారం కానున్నాయని , పల్లెల రూపురేఖలు మారనున్నాయని అన్నారు. గడిచిన ఐదేళ్లకాలంలో కనీస అవసరాలకు నోచుకోక, గెలిచిన సర్పంచులు అభివృద్ధి చేయలేక, అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నారన్నారు. పదిహేనో ఆర్థిక సంఘం నిధులను కూడా విద్యుత్తు బిల్లుల సాకుతో పక్కదారి పట్టించారని, గ్రామపంచాయతీల్లో పారిశుధ్య నిర్వహణకు కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన ఆర్థిక సంఘం నిధులను గత ప్రభుత్వం మింగేసిందని , చెత్తను కూడా తొలగించేందుకు నిధులు లేక వదిలేశాయని విమర్శించారు.



నేలపల్లి ముఖేష్‌ను సత్కరిస్తున్న నిర్వాహకులు

'ఆర్యమాత', 'ఆర్యపురుష' బిరుదుల ప్రదానం

గుంటూరు(తూర్పు), అక్టోబరు 13: స్థానిక అరండల్‌పేటలోని ఆర్య సమాజ మందిరంలో ఆదివారం పండిత గోపదవ్ వైదిక ధర్మ ప్రచార సమితి 20వ వార్షికోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. సభకు డాక్టర్ కొసరాజు రవీంద్ర అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా అనేక మృత దేహాలకు అంత్యేష్టి నిర్వహించిన కోనేరు జానకీదేవికి ఆర్యమాత, ఆర్య సమాజ సిద్ధాంతాలను ఆచరించి ప్రచారం చేస్తున్న కొత్తమాసు మలికార్జునరావుకు ఆర్యపురుష బిరుదును ప్రదానం చేశారు. ఒక్కొక్కరికి రూ.25,116 నగదు పుర స్కారాన్ని అందజేశారు. పెరూలో జరిగిన వరల్డ్ షూటింగ్‌లో పతకాలు సాధించిన నగరానికి చెందిన నేలపల్లి ముఖేష్‌కు ఈ సందర్భంగా సత్కరించారు. డాక్టర్ కొండబోలు కృష్ణప్రసాదు ఆలపించిన పద్యాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో డాక్టర్ యలమంచిలి శివాజీ, నూతలపాటి అరవింద్, మాఘం కృష్ణమూర్తి, పలివర్తి శ్రీనివాస రావు, నాగభైరవ గంగాపార్వతి తదితరులు ప్రసంగించారు.



శాస్త్రీయ సంగీత విభావరిలో పాల్గొన్న కళాకారులు

శాస్త్రీయ సంగీత విభావరి

గుంటూరు(తూర్పు), అక్టోబరు 13: స్థానిక బ్రాడీపేటలో అభయ హస్త శిర్డీ సాయి మందిరంలో ఆలయ వార్షికోత్సవ వేడుకలు, సాయిబాబా మహాసమాధి ఉత్సవాలు వేడకుగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా శనివారం సాయిచాలీసా, ఊరేగింపు, పల్లకీ సేవ, నగర సంకీర్తన నిర్వహించారు. అనంతరం అన్నప్రసాద వితరణ గావించారు. ఉత్సవాల్లో భాగంగా ఆదివారం అభిషేకం, అష్టోత్తర పూజ, సహస్ర నామార్చన జరిగింది. అనంతరం సాయంత్రం శ్రీ త్యాగరాజ కళాభారతి ఆధ్వర్యంలో 101 మంది కళాకారులతో నిర్వహించిన సంగీత విభావరి ఆకట్టుకుంది.

ఏపీటీఎఫ్ కార్యాలయాల్లో పట్టభద్రుల ఓటరు నమోదు

గుంటూరు(విద్య),అక్టోబరు 13: ఉమ్మడి గుంటూరు, కృష్ణా జిల్లాల పట్టభద్రుల శాసనమండలి ఎన్నికలకు ప్రతి ఏపీటీఎఫ్ కార్యకర్త, ఉపాధ్యాయులు, గ్రాడ్యుయేట్స్ అందరూ ఓటు నమోదు చేసుకోవాలని ఏపీటీఎఫ్ రాష్ట్ర పూర్వ ప్రధాన కార్యదర్శి పి.పాండురంగ వరప్రసాదరావు పిలుపునిచ్చారు. జిల్లా కోర్టు ఎదురుగా ఉన్న ఏపీటీఎఫ్ జిల్లా కార్యాలయంలో పట్టభద్రుల ఓటు నమోదు కార్యక్రమాన్ని ఏపీటీఎఫ్ నాయకులతో కలసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ముఖ్యకార్యకర్తలు, నాయకులతో ఆయన మాట్లాడుతూ విద్యారంగ ప్రగతి కి,ఉపా .ధ్యాయ, ఉద్యోగుల సంక్షేమానికి పాటుబడే మంచి అభ్యర్థులను ఎన్నుకున్నప్పుడే మన హక్కులకు రక్షణ ఉంటుందని అన్నారు. ఏపీటీఎఫ్ జిల్లా కార్యాలయం గుంటూరు, పొన్నూరు జోన్‌లో ఎన్జీ రంగా విగ్రహం వెనుక గల ఏపీటీఎఫ్ కార్యాలయంలో, తెనాలి కొత్తపేట లోని హెడ్ పోస్ట్ ఆఫీస్ వద్ద నున్న ఏపీటీఎఫ్ జోనల్ కార్యాలయంలో సత్తెనపల్లి, నరసరావుపేట, వినుకొండ ,మాచర్ల. రేపల్లె, చేరుకుపల్లి,మంగళగిరి, చిలకలూరిపేట తదితర జోనల్ కార్యాలయాల్లో ఓటు నమోదు కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. సమావేశంలో జిల్లా అధ్యక్షులు కె.బసవలింగారావు, కార్యదర్శి మహమ్మద్‌ఖాలీద్,సీనియర్ నాయకులు జిలాని పాల్గొన్నారు.

● అవగాహన సంస్థలో..

గుంటూరు, అక్టోబరు 13: గుంటూరు, కృష్ణా జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గ ఓటర్ల నమోదు ఫారాలను అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో అందజేస్తున్నారు. ఈ సందర్భంగా సీనియర్ వైద్యులు డాక్టర్ పీవీకే ఆర్ రామకృష్ణ చేతుల మీదుగా ఉచితంగా ఫారాలను పంపిణీ చేసే కార్యక్రమాలను ప్రారంభించారు. అనంతరం డాక్టర్ రామ కృష్ణ మాట్లాడుతూ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగించుకునేందుకు మేధావులు, విద్యావంతులు సిద్ధంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి, ముప్పాళ్ళ ప్రసాద రావు, సదాశివం, సింగరయ్య, చంద్రయ్య తదితరులున్నారు.

ఉమ్మడి కార్యాచరణని మందుకు తీసుకెళ్దాం

● అమరావతి జేఏసీ అధ్యక్షుడు మాదల శ్రీనివాస్

గుంటూరు, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అభివృద్ధి, అమరావతి రాజధాని విషయంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఉమ్మడి కార్యాచరణని కులమత రహితంగా ముందుకు తీసుకెళ్లాల్సిన అవసరం ఉందని అమరావతి జేఏసీ అధ్యక్షుడు మాదల శ్రీనివాస్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. రాబోయే రెండేళ్లు ఎంతో కీలకమని, అమరావతి రైతులు గత ప్రభుత్వ హయాంలో నిరంతరం పోరాడి 1631 రోజుల పాటు చరిత్రాత్మక ఉద్యమం నిర్వహించి రాజధానిని కాపాడుకోవడం జరిగిందన్నారు. ఎన్‌డీఏ-1 హయాంలో ప్రధాని నరేంద్ర మోదీ సరిగ్గా 9 ఏళ్ల క్రితం విజయదశమి పర్వదినాన అమరావతి రాజధానికి శంకుస్థాపన చేశారని గుర్తుచేశారు. కేంద్రం, రాష్ట్రంలో ఎన్‌డీఏ కూటమి ప్రభు త్వాలు ఏర్పడినందున అమరావతి అభివృద్ధి త్వరితగతిన జరగాలని ఆకాంక్షించారు.

16 నుంచి ఈశా ఫౌండేషన్ ఇన్నర్ ఇంజనీరింగ్

గుంటూరు(తూర్పు), అక్టోబరు 13: ఈశా ఫౌండేషన్ ఆధ్వ ర్యంలోఈ నెల 16 నుంచి 22వ తేదీ వరకు వారం రోజుల పాటు గుంటూరు నగరంలో 'ఇన్నర్ ఇంజనీరింగ్' కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఈశా వలంటీర్లు ఒక ప్రకటనలో తెలిపారు. 'ఇన్నర్ ఇంజనీరింగ్' అనేది సద్గురు రూపకల్పన చేసిన ఒక పరివర్తన కార్యక్రమని, ఇందులో సులభమైన యోగ సాధనలు, సద్గురు సూచనలతో రూపొందించిన ప్రక్రియలు ఉంటా యని తెలిపారు. శాంభవి మహాముద్ర క్రియ అనే శక్తి వంతమైన 21 నిమిషాల యోగ సాధన ఉంటుందని పేర్కొన్నారు. ఈ సాధన ద్వారా ఒత్తిడి, భయం, అలర్జీ, బీపీ, ఆందోళన దూరమవుతుందని అన్నారు. ఇతర వివరాలకు 99493 12299 నంబరులో సంప్రదించాలని సూచించారు.

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

గుంటూరు, అక్టోబరు 13: విద్యుత్ లైన్‌ల నిర్వహణలో భాగంగా సోమవారం పలు ప్రాతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు సెక్షన్ ఏఈ బి శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. నల్లచెరువు, సంగడిగంట, ఆర్ అగ్రహారం, వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయం రోడ్డు, చలమయ్య కళాశాల రోడ్డు, ముప్తీ స్ట్రీట్, బాబూ హోటల్ సెంటర్, పట్నం బజార్, డీఎస్ నగర్, ఏటుకూరు రోడ్డు, సంగడిగుంట, గాంధీనగర్, మూడు బొమ్మల సెంటర్, నల్లచెరువు ప్రాంతాల్లో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు పేర్కొన్నారు. విద్యుత్ అంతరాయానికి ప్రజలు సహకరించాలని కోరారు.



ప్రసంగిస్తున్న డాక్టర్ కోటా సురేష్‌కుమార్

మానసిక సమస్యలపై నిర్లక్ష్యం వద్దు

గుంటూరు (మెడికల్) అక్టోబర్ 13: మానసిక ఆరోగ్య సమ స్యలు ఏ వయస్సు వారికైనా రావచ్చని, తొలిదశలో గుర్తించి వైద్యులను సంప్రదిస్తే మందులు లేకుండానే కౌన్సెలింగ్ ద్వారా సమస్య పరిష్కరించవచ్చని కాటూరి మెడికల్ కాలేజీ మానసిక వైద్య విభాగాధిపతి డాక్టర్ కోటా సురేష్‌కుమార్ తెలిపారు. స్థానిక బ్రాడీపేటలోని ఎస్‌హెచ్‌వో కార్యాలయంలో ఆదివారం మానసిక సమస్యలపై ఉచిత వైద్య సలహా, శాస్త్రీయ అవగాహన శిబిరం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ నేటి సమాజ పరిస్థితులు, జీవన విధానం, ఆహారంలో వచ్చిన మార్పులు, వృత్తిపరమైన మానసిక ఒత్తిడి, ఆందోళనలు అనేక మానసిక సమస్యలకు కారణమవుతున్నట్లు వివరించారు. ఈ సమస్యలు చాలా చిన్నవని, ఇవి మానసిక వ్యాధులు కావని చెప్పారు. ఆయా సమస్యలను నిరోధించకపోతే అనేక ఇతర ఆరోగ్య సమస్యలు తలఎత్తే అవకాశం ఉందని అన్నారు. సర్వీస్ హెల్త్ ఆర్గనైజేషన్ అధ్యక్షుడు డాక్టర్ టీ సేవకుమార్ మాట్లాడుతూ తమ సంస్థలో ప్రతి నెల రెండో ఆదివారం స్పెషలిస్ట్ డాక్టర్‌తో ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మాన వతా స్వచ్ఛంద సేవా సంస్థ మెడికల్ క్యాంప్స్ చైర్మన్ టీ ధనుంజయరెడ్డి, డైరెక్టర్ కే ఆనందరావు, కే సాంబశివరావు, ఎం రామారావు, టీవీ సాయిరాం, పి నిర్మల రాణి, ఎస్ శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు. అనంతరం మానసిక ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్న వారిని డాక్టర్ సురేష్‌కుమార్ పరీక్షించి వైద్య సలహాలు అందజేశారు.



కేంద్రమంత్రి, ఎమ్మెల్యేలకు చెక్కు అందజేస్తున్న పోస్టల్ ఉద్యోగులు

నడకతో శారీరక, మానసిక ఆరోగ్యం

గుంటూరు, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): అన్ని వయసుల వారి శారీరక, మానసిక ఆరోగ్యానికి నడక ఎంతో అవసరమని తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే నసీర్ అన్నారు. ప్రతి ఏటా ప్రపంచ తపాలా దినోత్సవం అక్టోబరు 9వ తేదీన నిర్వహిసున్నారు. పోస్టల్ వారోత్సవాల్లో భాగంగా పోస్ట్ ఇండియా రన్- 2024 పేరుతో 10కే రన్, 5కే రన్‌ను ఆదివారం పోస్టల్ శాఖ నిర్వహించింది. ఈ కార్యక్రమానికి కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్‌తో కలిసి ఎమ్మెల్యే నసీర్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ భారతదేశంలో తపాలా సేవలు నిరుపమానమైన వని, ప్రస్తుతం దేశంలో 1.59 లక్షల పోస్టాఫీసులు ఉన్నాయని అన్నారు. ప్రజలకు ఆరోగ్యంపై అవగాహన కల్పిస్తూ పోస్టల్ శాఖ తీసుకున్న ఈ నిర్ణయం హర్షణీయమన్నారు. ప్రతిరోజు కనీసం 45 నిమిషాలు ప్రతి మనిషికి నడకవసరమని ప్రస్తుత కాలంలో నలభై ఏళ్లు దాటిన వారు మాత్రమే వాకింగ్ చేయాలనే ఆలోచిస్తున్నారు కానీ చిన్న వయసు నుంచే నడక, శారీరక వ్యాయామం అవసరమని అన్నారు.



పెమ్మసానిని సత్కరిస్తున్న దామచర్ల శ్రీనివాస్, దామచర్ల వంశీకృష్ణ తదితరులు

కేంద్ర మంత్రి పెమ్మసానికి ఆత్మీయ సత్కారం

గుంటూరు(తూర్పు), అక్టోబరు 13: కేంద్ర టెలికమ్యూనికేషన్ సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్‌ను తెలుగుదేశం పార్టీ జిల్లా అధికార ప్రతినిధి దామచర్ల శ్రీనివాస్ సత్క రించారు. అనంతరం నూతన దంపతులు దామచర్ల వంశీకృష్ణ, సాయి మాధురిలకు పెమ్మసాని శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ 45వ డివిజన్ అధ్యక్షుడు వడ్లమూడి వెంకటేశ్వరరావు, మొవ్వ వేణు, శివబాబు, కే నాగేశ్వరరావు, రత్తయ్య, బుజ్జి, రామ్‌మూర్తి, ఎమ్ వెంకటేశ్వరరావు, దామచర్ల చైతన్య, ధనలక్ష్మీ, హేమ, ఝాన్సీ, వాణీశ్రీ, కందిమళ్ల శంకరరావు, ప్రసాదురాజు పాల్గొన్నారు.



పోటీల ఆహ్వానపత్రికలను ఆవిష్కరిస్తున్న ఎంపీ శ్రీకృష్ణదేవరాయలు

రాష్ట్ర స్థాయి చెస్ పోటీల నిర్వహణ అభినందనీయం

గుంటూరు(తూర్పు), అక్టోబరు 13: రాష్ట్ర స్థాయి చదరంగ పోటీలు గుంటూరులో నిర్వహించడం అభినందనీయమని నరసరావుపేట ఎంపీ శ్రీకృష్ణదేవరాయలు అన్నారు. ఈ నెల 15వ తేదీ నుంచి మూడు రోజుల పాటు స్థానిక గోరంట్లలోని నెక్స్ జనరేషన్ పాఠశాలలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల ఆహ్వాన పత్రికలను ఆదివారం ఆయన ఆవిష్కరించారు. అనంతరం ఎంపీ మాట్లాడుతూ ప్రతిభ కల్గిన క్రీడాకారులకు ప్రభుత్వం అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. రాజధాని ప్రాంతంలో మరిన్ని క్రీడా పోటీలు నిర్వహించాలని ఆకాంక్షించారు. టోర్నమెంట్ డైరెక్టర్ వెవీకే చక్రవర్తి మాట్లాడుతూ పదిహేనేళ్ల లోపు వయస్సు కల్గిన బాలబాలికలు ఈ పోటీలలో పాల్గొనవచ్చని, విజయం సాధించిన క్రీడాకారులను జాతీయ పోటీలకు ఎంపిక చేస్తామని తెలిపారు.



సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న వేంపాటి పాపారావు

ప్రభుత్వ శాఖల్లో కొత్త వాహనాలు కొనుగోలు చేయాలి

● ఏపీ ప్రభుత్వ వాహన డ్రైవర్ల సంఘం డిమాండ్

గుంటూరు, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని అన్ని ప్రభుత్వ శాఖల్లో కొత్త వాహనాలను కొనుగోలు చేయాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ వాహన డ్రైవర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు వేంపాటి పాపారావు కోరారు. ఆదివారం కలెక్టరేట్ వద్ద ఉన్న అసోసియేషన్ కార్యాలయంలో జరిగిన సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. గత ప్రభుత్వాల హయాంలో విచ్చలవిడిగా అద్దె వాహనాలను తీసుకున్నారని, వాటన్నింటిని తొలగించాలన్నారు. కొత్త వాహనాల కొనుగోలు, రిపేర్‌కు గురైన వాటి మరమ్మతులకు అవసరమైన బడ్జెట్(నిధులు) విడుదల చేయాలని విజ్ఞప్తి చేశారు. అద్దె వాహనాలను కొనసాగిస్తే డ్రైవర్ పోస్టులు రద్దు అయ్యే ప్రమాదం ఉందన్నారు. ఇప్పటికే రిక్రూట్‌మెంట్‌లు లేక రిటైర్డ్ అయిన వారి పోస్టులు ఖాళీగానే ఉంచుతున్నారని చెప్పారు. తమ డిమాండ్ల సాధన కోసం త్వరలో రాష్ట్ర మంత్రులు, ఉన్నతాధికారులను కలిసి విజ్ఞప్తి చేస్తామన్నారు. అనంతరం సర్వీసులో ఉండి అనారోగ్యంతో చనిపోయిన డ్రైవర్ల కుటుంబ సభ్యులకు రూ.10 వేల చొప్పున అసోసియేషన్ తరపున ఆర్థికసాయం అందించారు. ఇటీవలే డ్రైవర్లుగా పని చేస్తూ రిటైర్ అయిన వారికి రూ. 5 వేల చొప్పున ఆర్థికసాయం అందించారు. మరో డ్రైవర్ కుమార్తె వివాహానికి కూడా సాయం చేశారు.

ఆంజనేయులు సేవలు ఎనలేనివి

గుంటూరు సిటీ, అక్టోబరు 13 : ఉపరాష్ట్రపతి అవార్డు గ్రహీత ఆంజనేయులు వ్యవసాయ శాఖ లో చేసిన సేవలు ఎనలేనివని గుంటూరు జిల్లా ప్రభుత్వ వాహన డ్రైవర్ల సంఘం అధ్యక్షులు వేంపాటి పాపారావు అన్నారు. దసరా ఉత్సవాలను పురస్కరించుకుని ప్రభుత్వ శాఖల్లో ఉత్తమ సేవలు అందించిన వారిని ప్రభుత్వ వాహన డ్రైవర్ల సంఘం ఆధ్వర్యంలో ఆదివారం సన్మానించారు. ఈ సందర్భంగా పాపారావు మాట్లాడుతూ వ్యవసాయ శాఖలో నకిలీ విత్తనాలు, పురుగుమందుల వ్యాపారుల ఆటకట్టించడంలో ఆంజనేయులు ప్రఖ్యాతి పొందారని అన్నారు.



దిక్సూచి DIKSUCHI

పోటీ పరీక్షల ప్రత్యేకం

ఇండియన్ జాగ్రఫీ

పర్యావరణం - అధ్యయనం

పర్యావరణం-అధ్యయనానికి సంబంధించి గతంలో వాతావరణం, పర్యావరణాల్లోని పలు విషయాలను తెలుసుకున్నాం. ఇప్పుడు వివిధ ఆవరణాల వివరాలను తెలుసుకుందాం.

జలావరణం

ఈ ఆవరణాన్ని ఆంగ్లభాషలో హైడ్రోస్ఫియర్ అని అంటారు. గ్రీకుభాషలో హర్యాడర్ అనగా జలం అని అర్థం. 'భూమిపై ఉన్న జల వనరులన్నీ అనగా సముద్రాలు, నదులు, జలాశయాలు, కుంటలు, సరస్సులు వాటన్నింటినీ కలిపి జలావరణం అంటారు. హైడ్రోజన్, ఆక్సిజన్ వాయువుల కలయిక వల్ల హెచ్‌టూ2(జలము) ఏర్పడుతుంది.

- భూ ఉపరితలంపై 71% అనగా 2/3వ వంతు జలభాగం ఆవరించింది. దీనిలో 1) సముద్రాల్లోని ఉప్పునీటి శాతం 97.3% 2) మంచినీటి శాతం 2.7%
- ఆర్కిటిక్, అంటార్కిటిక్ ప్రాంతంలో ఘనస్థితిలో ఉన్న మంచినీటి శాతం 2.14%
- చెరువులు, కుంటలు, సరస్సులో ఉన్న ద్రవస్థితిలో ఉన్న మంచినీటి శాతం 0.0009%
- నదులు, చెరువులు, కాలువల్లో ఉన్న మంచినీటి శాతం 0.0001%
- వాతావరణంలోని తేమ రూపంలో ఉన్న మంచినీటి శాతం 0.0001%
- భూగర్భంలో ఉన్న మంచినీటి శాతం 0.61%
- జల సంబంధిత చక్రం కీలకపాత్ర వహిస్తూ జీవులకు ఆధారమైన నీటిని సమకూర్చడంలో ముఖ్యపాత్ర వహిస్తుంది.

శిలావరణం

భూమిలో ఘనీభవించిన పొర, లేదా గట్టిగా ఉండే పైపొర ఇది. దీనిలో రాళ్లు, ఖనిజ లవణాలు ఉండి మందపాటి మట్టి పొర ఉంటుంది. గ్రీకుభాషలో లిథోస్ అనగా శిల అని అర్థం. స్ఫెయిరా అంటే గోళం లేదా బంతి. ఈ ఆవరణాన్ని ఆంగ్లభాషలో లిథోస్ఫియర్ అంటారు. దీనిని అశ్మావరణం అని కూడా పిలుస్తారు. భూమి, దానిపై ఘనరూపంలో ఉండే భాగాలన్నింటిని శిలావరణం అంటారు.

- భూ ఉపరితలం నుంచి సగటున 40 కి.మీ. లోతు వరకు విస్తరించి ఉన్న ఘనస్థితిలోని భూమి బాహ్యపొర.
- భూమిపై ఉండే పర్వతాలు, మట్టిపొరలు, పీఠభూములు, రాళ్లు మొదలైనవి శిలావరణం కిందికి వస్తాయి.
- భూమి ఉపరితలం పొరను సాంద్ర మండలం అంటారు.

భూమి పొరల్లో ఉండే మట్టి ఖనిజాలు, ఖనిజ ఇంధనాలు మొదలైనవి శిలావరణంలో చేరతాయి.

జీవావరణం

పర్యావరణ వ్యవస్థలోని వాతావరణం, జలావరణం, శిలావరణాలు వ్యాపించి జీవులకు అనువైన ఆవరణ భాగాన్ని జీవావరణం అంటారు. జీవావరణం భూ ఉపరితలం మీదనూ, భూ ఉపరితలం నుంచి దాదాపు 200 మీ. లోతు వరకు, భూ ఉపరితలం వాతావరణంలో దాదాపు 7 నుంచి 8 కి.మీ. ఎత్తు వరకు విస్తరించి ఉంది.



- సూక్ష్మక్రిములు, బ్యాక్టీరియా, వైరస్, మొక్కల నుంచి వెలువడే బీజాంకురాలు, పుప్పొడి కణాలు వాతావరణంలోని వాయువుల ద్వారా అంతటా వ్యాపిస్తాయి.
- అలాగే కోట్లాది జీవులు సముద్ర జలాల్లో నివశిస్తున్నాయి. కాబట్టి జీవులకు అనువైన జలావరణం, వాతావరణం, శిలావరణం వీటన్నింటినీ జీవావరణం అంటారు.
- జీవావరణంలో జీవుల మధ్య పరస్పరము ఇచ్చిపుచ్చుకునే ధోరణి ఉంటుంది. వీటినే ఉతక్షొత్తిదారులు వినియోగదారులు, విచ్ఛిన్నకారులు అంటారు.

పర్యావరణంపై మానవుని ప్రభావం

సహజసిద్ధ పర్యావరణంలో భూమిపై నివశిస్తున్న భిన్నరకాల జీవజాతులు, చుట్టూ ఉన్న పరిసరాలకు అనుగుణంగా, పరిసరాలకు లోబడి నివసించేవి. ప్రతి జీవి జీవన చర్యలను వాటి చుట్టూ ఉన్న పర్యావరణంలోని వనరులు నియంత్రిస్తాయి.

- సహజసిద్ధ పర్యావరణంలో జీవులకు, వాటి చుట్టూ ఉన్న పరిసరాలకు మధ్య గల సంబంధాలు సకారాత్మకంగా ఉన్నందున పర్యావరణ సమతుల్యం స్థిరంగా ఉంటుంది.
- జీవరాశులన్నింటిలో ఒక్క మానవునికి మాత్రమే తన పరిసరాల్లోని సహజ వనరులను వివిధ రూపాల్లో వినియోగించుకునే సామర్థ్యం ఉంది.
- ప్రాచీన మానవుడు తన కనీస అవసరాలు(గాలి, నీరు, నేల, ఆవాసం) మేరకే సహజ వనరులను వినియోగించేవాడు. దీనిలో భాగంగా ఏర్పడే వ్యర్థాలను తన చుట్టూ ఉన్న పర్యావరణం సులభంగా తనలో ఇముడ్చుకునేది.
- మానవుడు నిప్పును కనిపెట్టడంతో పర్యావరణంపై మానవ ప్రభావం ప్రారంభమైంది. దీనితో క్రూర మృగాలను దెబ్బతీయడం, అడవులను తగులపెట్టి వ్యవసాయ భూములుగా మార్చడం, స్థిర వ్యవసాయాన్ని ప్రారంభించడంతో ఆవరణ వ్యవస్థలపై మానవుని ప్రభావం వేగవంతమైందని చెప్పవచ్చు.

పారిశ్రామిక విప్లవం తరవాత పర్యావరణంపై మానవ ప్రభావం పెరగడానికి, పర్యావరణ వనరులు క్షీణించడానికి గల కారణాలు

1) జనాభా పెరుగుదల 2) వేగంగా విస్తరిస్తున్న పారిశ్రామికీకరణ, పట్టణీకరణ 3) ఆధునిక ప్రపంచ ఆర్థిక పోకడలు(సరళీకరణ, ప్రపంచీకరణ) 4) శాస్త్ర, సాంకేతిక పరిజ్ఞానం 5) కొత్త వినిమయ సంస్కృతి కారణంగా ఘన వ్యర్థాలు పెరగడం.

- ఉపాధికి ప్రజలు పట్టణాలకు వలస వెళ్లడం వల్ల అక్కడ జనాభా పెరిగి నగర ఆవరణ వ్యవస్థలు కాలుష్యానికి గురయ్యాయి. మురికివాడల సంఖ్య పెరిగింది.
- మానవుడు తన సాంకేతిక నైపుణ్యం ద్వారా తన చుట్టూ ఉన్న పర్యావరణాన్ని తనకు అనుకూలంగా మార్చుకోవడంతో సహజ ఆవరణ వ్యవస్థ తన స్వభావాన్ని మార్చుకోవడంతో సహజ వనరుల నాణ్యత తగ్గి జీవ వైవిధ్యత దెబ్బతింటుంది. పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా ఆహార ధాన్యాల ఉత్పత్తిని అధికం చేసే ప్రయత్నంలో హరితవిప్లవ సాంకేతిక పద్ధతులు ఉపయోగించడం వల్ల జల వనరులు కాడ్మియం, ఫ్లోరిన్, లెడ్ లాంటి భార లోహకాలతో కలుషితమయ్యాయి.
- మానవుడు అభివృద్ధి కార్యకలాపాలు, ఆర్థిక ప్రయోజనాలకు, విలాసవంతమైన జీవనానికి భవిష్యత్ తరాలకు అందించాల్సిన వనరులను కూడా దెబ్బతీస్తున్నాడు. దీని ఫలితమే గ్లోబల్ వార్మింగ్, ఆమ్ల వర్షాలు, ఓజోన్ పొర క్షీణత, జల వనరుల కొరత, భూకంపం, సునామీలు ఏర్పడుతున్నాయి.
- పై వాటితో పాటు నివాస, పారిశ్రామిక ప్రాంతాల నుంచి విడుదలయ్యే మురుగు, పంట పొలాలు, చేపల చెరువులు, రొయ్యల చెరువుల నుంచి విడుదలయ్యే వ్యర్థాలు, పోషకాలు జలాశయాల్లో చేరుతున్నాయి. దాంతో జలాశయాలు యూట్రిఫికేషన్ కాలుష్యానికి లోనై సాగు, తాగు నీటికి పనికిరాకుండా పోతున్నాయి.
- అదేవిధంగా కోస్టల్ కారిడార్ నిర్మాణాలు, ట్రాలరీ బోట్స్, డీప్ - సీ - ఫిషింగ్ విధానాల వల్ల కోస్తా ఆవరణ వ్యవస్థలు తీవ్రంగా దెబ్బతింటున్నాయి.
- పైన తెలిపిన ధోరణులను పరిశీలిస్తే మానవుడు తన జీవన శైలిని పర్యావరణ సామర్థ్యానికి అనుకూలంగా మార్చుకోవాలి. పర్యావరణానికి, మానవునికి మధ్య సంబంధాలు సహకారాత్మకంగా ఉండాలి. లేకపోతే పర్యావరణ ఆధిపత్యం శీతోష్ణస్థితిలో మార్పుల రూపంలో అధికమై జీవజాతి మనుగడే ప్రమాదంలో పడుతుంది.
- మానవుడు అభివృద్ధి కార్యక్రమాల్లో చేపట్టే చర్యల వల్ల ఏర్పడే పర్యావరణ క్షీణతను జీవావరణ వధ అని పిలుస్తారు. ఈ పదాన్ని మొదటి సారిగా 1972లో స్టాక్‌హోమ్‌లో జరిగిన అంతర్జాతీయ పర్యావరణ సదస్సులో ఉపయోగించారు.



వి. వెంకట్‌రెడ్డి
సీనియర్ ఫ్యాకల్టీ

పాచికలు

పోటీ పరీక్షల ప్రత్యేకం

రీజనింగ్



పాచికలు టాపిక్‌కి సంబంధించిన ప్రశ్నలలో ఒక పాచిక రెండు లేదా మూడు లేదా నాలుగు స్థితులను(పొజిషన్) ఇస్తుంటారు. ఆ డయాగ్రామ్స్‌లో అంకెలను లేదా వర్ణమాల అక్షరాలను లేదా చుక్కలను లేదా మేథమెటికల్ గుర్తు (+, -, x, ÷)లను లేదా చిన్న చిన్న రేఖాచిత్రాలను (Δ, □, ▭, ▯) ఇస్తారు. డయాగ్రామ్స్‌లో ఇచ్చిన ఏదేని అంకె లేదా చుక్కలు లేదా వర్ణమాల అక్షరాల్లో ఏదో ఒక దానిని తెలుపుతూ దానికి ఎదురుగా ఉండే ముఖభాగంలో గల అంకె లేదా అక్షరం లేదా గుర్తు లేదా రేఖాచిత్రాన్ని తెలపమని అడుగుతారు.

పాచికకు(సిక్స్ సైడ్స్) ఆరు ముఖభాగాలు ఉంటాయి. ప్రతి ముఖభాగానికి ఎదురు ముఖభాగం అనేది ఉంటుంది. ఎదురు ముఖభాగం అనేది కనిపించదు. ప్రతి ముఖ భాగానికి (ఫోర్ సైడ్స్) నాలుగు పక్కపక్క ముఖభాగాలు కనిపించే విధంగా ఉంటాయి. ఒక ముఖభాగం కనిపించదు. కనిపించని ముఖభాగాన్ని ఎదురు ముఖభాగంగా గుర్తించాలి.


ఈవిధంగా పాచికకు ఆరు ముఖభాగాలు ఉంటాయి.

ఆరు ముఖభాగాలు ఉండే పద్ధతి (రూల్)

అడిగినటువంటి ముఖభాగంలో గల అక్షరం		దానికి కనిపించే విధంగా నాలుగు పక్క ముఖభాగాలు		అడిగినటువంటి ముఖభాగానికి ఎదురుగా (కనబడకుండా) ఉండే ముఖభాగం
1	+	4	+	1
				= 6 (సిక్స్ సైడ్స్)

గమనిక: ఏదేని ఒక ముఖ భాగానికి ఎదురుగా ఉండే ముఖ భాగం కనబడదు అనేది అర్థమైనది. ఈ టాపిక్‌కి సంబంధించిన ప్రశ్నలన్ని ఎదురుగా ఉండే ముఖభాగంలో గల అక్షరం లేదా సంఖ్య లేదా గుర్తు ఆ విధంగా మాత్రమే ఉంటాయి.

1. కింది ఇచ్చిన పాచిక వివిధ స్థితుల ఆధారంగా 2 అనే అంకె గల ముఖ భాగానికి ఎదురుగా ఉండే ముఖభాగంలో గల అంకె ఏది?




ఎ) 6 బి) 4 సి) 5 డి) 3

సమాధానం: (సి)

వివరణ: ఇచ్చిన పాచికల స్థితులను గమనిస్తే మొదటి డయాగ్రమ్‌లో 2కు పక్కగా 1, 3 అంకెలు
రెండో డయాగ్రమ్‌లో 2కు పక్కగా 3, 4 అంకెలు
నాలుగో డయాగ్రమ్‌లో 2కు పక్కగా 1, 6 అంకెలు కనిపిస్తున్నాయి. అనగా 2కు పక్కగా 1, 3, 4, 6 అంకెలు కనిపిస్తున్నాయి. పాచికకు ఆరు ముఖభాగాలు ఉన్నాయి. ఇక్కడ '2'కు పక్కగా '5' అంకె కనిపించడం లేదు. కాబట్టి 2 అనే అంకె గల ముఖ భాగానికి ఎదురుగా ఉండే ముఖభాగంలో గల అంకె '5' అవుతుంది. కాబట్టి సమాధానం (సి) అవుతుంది.

2. కింది ఇచ్చిన పాచిక వివిధ స్థితుల ఆధారంగా 6 అనే అంకె గల ముఖభాగానికి ఎదురుగా ఉండే ముఖభాగంలో గల అంకె ఏది?




ఎ) 4 బి) 2 సి) 1 డి) 5

సమాధానం: (ఎ)

వివరణ: ఇచ్చిన పాచిక స్థితులను గమనిస్తే మొదటి డయాగ్రమ్‌లో 6కు పక్కగా 1, 3 అంకెలు
రెండో డయాగ్రమ్‌లో 6కు పక్కగా 5, 3 అంకెలు
మూడో డయాగ్రమ్‌లో 6కు పక్కగా 5, 2 అంకెలు కనిపిస్తున్నాయి. అనగా 6కు పక్కగా 1, 2, 3, 5 అంకెలు కనిపిస్తున్నాయి. పాచికకు ఆరు ముఖభాగాలు ఉన్నాయి. ఇక్కడ '6'కు పక్కగా 4 అంకె కనిపించడం లేదు. కాబట్టి 6 అంకె గల ముఖ భాగానికి ఎదురుగా ఉండే ముఖ భాగంలో గల అంకె '4' అవుతుంది. కాబట్టి సమాధానం(ఎ) అవుతుంది.

3. కింది ఇచ్చిన పాచిక వివిధ స్థితుల ఆధారంగా 'Q' అనే అక్షరం గల ముఖ భాగానికి ఎదురుగా ఉండే ముఖభాగంలో గల అక్షరం ఏది?



ఎ) T బి) U సి) R డి) S

సమాధానం: (డి)

వివరణ: ఇటువంటి ప్రశ్నల్లో ముందుగా ఇచ్చిన ఆరు అక్షరాలు పరిశీలించాలి.

ఈ ప్రశ్నలో ఇచ్చిన ఆరు అక్షరాలు P, Q, R, S, T, U పై డయాగ్రమ్‌లలో మూడో డయాగ్రమ్‌లో మాత్రమే 'Q' ఉంది. Qకు పక్కగా గల అక్షరాలు P, R. అనగా Uకు ఎదురుగా ఉండే ముఖభాగంలో S, T, Uల్లో కచ్చితంగా ఏ అక్షరం ఉంటుందో తెలియడంలేదు. ఇలాంటి సందర్భాల్లో అడిగినటువంటి అక్షరం గల పాచిక వదిలివేసి మిగిలిన పాచికల్లో కామన్ లెటర్ ఉంటే ఆ అక్షరమే సమాధానం అవుతుంది. దానిని మరింత వివరంగా తెలుసుకుందాం. ఈ ప్రశ్నలో Q అనే అక్షరం గల మూడో పాచికను వదిలివేసి మిగిలిన 1, 2, 4 పాచికల్లో S అనేది కామన్ లెటర్ ఇప్పుడు 'S'ని పరిశీలిస్తే మొదటి డయాగ్రమ్‌లో 'S'కు పక్కగా P, T అక్షరాలు
రెండో డయాగ్రమ్‌లో 'S'కు పక్కగా P, R అక్షరాలు
నాలుగో డయాగ్రమ్‌లో 'S'కు పక్కగా U, R అక్షరాలు కనిపిస్తున్నాయి. అనగా 'S'కు పక్కగా P, R, R, U అక్షరాలు కనిపిస్తున్నాయి. పాచికకు ఆరు ముఖభాగాలు ఉన్నాయి. ఇక్కడ 'S'కు పక్కగా 'Q' అక్షరం కనిపించడం లేదు. అనగా 'S'కి ఎదురుగా ఉండే ముఖభాగంలో గల అక్షరం 'Q' అని అర్థం. (అనగా Q అండ్ S లుఆపోజిట్ సైడ్స్) కాబట్టి సమాధానం (డి) అవుతుంది.



డాక్టర్ పండిటి మీనాక్షి పవన్
సీనియర్ ఫ్యాకల్టీ

దేవరగట్టు.. తలలు పగిలేట్టు



దేవరగట్టుపై కర్రల సమరం సాగిస్తున్న భక్తులు

- ఉత్సవమూర్తుల కోసం హోరాహోరీగా కర్రల సమరం
- 80 మందికిపైగా గాయాలు... కొందరికి పగిలిన తలలు
- కర్నూలు జిల్లాలో అనాదిగా వస్తున్న ఆచారం

ఆలూరు, అక్టోబరు 13: కర్నూలు జిల్లా హోళగుంద మండలం దేవరగట్టు మాళ మల్లేశ్వర స్వామి ఆలయంలో శనివారం విజయదశమి రోజున అర్ధరాత్రి బన్ని (కర్రల సమరం) హోరాహోరీగా సాగింది. ఆంధ్ర, కర్ణాటక, మహారాష్ట్ర ప్రాంతాల నుంచి భారీ ఎత్తున జనం తరలివచ్చారు. ఒళ్లు గగుర్పొడిచేలా సాగిన ఈ పోరాటంలో పదుల సంఖ్యలో భక్తులు గాయాలపాలయ్యారు. మరికొంత మంది తలలు పగిలాయి. శనివారం అర్ధరాత్రి నెరణికి, నెరణికి తండా.. కొత్తపేట, అరికేర గ్రామాల భక్తులు ఇనుప రింగులు తొడిగిన కర్రలతో సమరానికి బయల్దేరారు. చేతిలో అగ్ని దివిటీలతో 'డిర్ర్.. గో పరాక్..' అంటూ కేకలు వేస్తూ ఉత్సవమూర్తులను దక్కించుకునే సమయంలో పోటీ పడ్డారు. ఎప్పటిలాగే నెరణికి గ్రామస్థులే ఉత్సవ మూర్తులను దక్కించుకుని తమ గ్రామానికి తీసుకెళ్లే సమయంలో కొత్తపేట, అరికేర, నెరణికి తండాలకు చెందిన భక్తులు అడ్డుకునే ప్రయత్నం చేశారు. కర్రలతో ఒకరిపై ఒకరు దాడులు చేసుకున్నారు. ఈ సమరంలో 80మందికి పైగా గాయాలపాలయ్యారు. వారికి పసుపు పూసి చికిత్స నిమిత్తం ఆలూరు, ఆదోని ప్రభుత్వ ఆసుపత్రులకు తరలించారు. జిల్లా ఎస్పీ బిందు మాధవ్ ఉత్సవ ఏర్పాట్లను పర్యవేక్షించారు. కర్రలతో దాడులను నివారించేందుకు పోలీసులు వారం ముందునుంచే అవగాహన కల్పిస్తూ వచ్చారు.

బైక్ అదుపు తప్పి ముగ్గురు మృతి

దేవరగట్టు ఉత్సవానికి వస్తుండగా ఘటన

ఆలూరు, అక్టోబరు 13 : దేవరగట్టు బన్ని ఉత్సవాలను వీక్షించేందుకు వెళ్తున్న ముగ్గురు యువకులు రోడ్డు ప్రమాదంలో దుర్మరణం పాలయ్యారు. కర్ణాటక రాష్ట్రం బళ్లారి జిల్లా తగ్గి నబుదిహాల్ గ్రామనికి చెందిన హరీష్(22), మల్లికార్జున (26), రవి కుమార్ (27) ముగ్గురూ ఒకే బైక్‌పై దేవరగట్టు ఉత్సవాలను వీక్షించేందుకు హొళగుందకు బయల్దేరారు. హొళగుంద మండలం అరికెర క్రాస్ వద్దకు రాగానే బైక్ అదుపుతప్పింది. దీంతో ముగ్గురు అక్కడికక్కడే మృతి చెందారు. యువకులు బళ్లారి జిల్లా కరేకల్లు జిందాల్ ఫ్యాక్టరీలో దినకూలీలుగా పనిచేస్తున్నారు.



హరీష్, మల్లికార్జున రవి కుమార్



తిరుమలలో వైభవంగా చక్రస్నానం

- ధ్వజావరోహణంతో ముగిసిన శ్రీవారి బ్రహ్మోత్సవాలు
- వాహన సేవలను వీక్షించిన 15 లక్షల మంది భక్తులు : టీటీడీ ఈవో



చక్రత్తాళ్వారును పుష్కరిణిలోకి తీసుకొస్తున్న అర్చకులు

తిరుమల, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాల్లో చివరి ఘట్టమైన చక్రస్నానం శనివారం వైభవంగా జరిగింది. 9 రోజుల పాటు వైభవంగా నిర్వహించిన బ్రహ్మోత్సవాలకు చక్రస్నానం, ధ్వజావరోహణంతో టీటీడీ ముగింపు పలికింది. ముందుగా తెల్లవారుజామున 3 నుంచి 6గంటల వరకు స్వామి కి పల్లకీ ఉత్సవం, ఉదయం 6నుంచి 9గంటల మధ్యలో శ్రీభూవరాహస్వామి ఆలయ ముఖ మండపంలో శ్రీదేవి, భూదేవి సమేత మలయప్ప స్వామికి, సుదర్శన చక్రత్తాళ్వారుకు స్నపన తిరుమంజనం నేత్రపర్వంగా నిర్వహించారు. తర్వాత సుదర్శన చక్రాన్ని పవిత్ర పుష్కరిణి జలంలో మునక వేయించగా, భక్తులు కూడా అదే సమయంలో పుణ్యస్నానాలు ఆచరించారు. ఇక, శనివారం సాయంత్రం ఆలయంలోని ధ్వజస్తంభం వద్ద ధ్వజావరోహణాన్ని ఆగమోక్తంగా నిర్వహించడంతో బ్రహ్మోత్సవాలు పరిసమాప్తమయ్యాయి. సాధారణంగా చక్రస్నానం అనంతరం తిరుమలలో పూర్తిగా రద్దీ తగ్గిపోతుంది. అయితే పెరటాసి మాసం చివరి శనివారం కావడంతో శని, ఆదివారాలు కూడా భక్తుల రద్దీ కొనసాగింది. ధ్వజావరోహణం ముందు మాడవీధుల్లో నిర్వహించిన తిరుచ్చి వాహనసేవలోనూ భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని ఉత్సవమూర్తులను దర్శించుకున్నారు. కాగా, చక్రస్నానంలో టీటీడీ ఉన్నతాధికారులతో పాటు హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ వెంకట జ్యోతిర్మయి, జస్టిస్ రవినాథ్ తిల్హరి పాల్గొన్నారు. ఉదయం వీరు ఆలయంలోకి వెళ్లి శ్రీవారిని దర్శించుకున్నారు.

విజయవంతంగా బ్రహ్మోత్సవాలు: టీటీడీ ఈవో

సామాన్య భక్తులకు ఎలాంటి అసౌకర్యం లేకుండా శ్రీవారి బ్రహ్మోత్సవాలను విజయవంతంగా నిర్వహించినట్లు టీటీడీ ఈవో శ్యామలరావు సంతోషం వ్యక్తం చేశారు. టీటీడీ చేపట్టిన ఏర్పాట్లపై భక్తులు సంతృప్తి వ్యక్తం చేశారని తెలిపారు. బ్రహ్మోత్సవాల్లో మొత్తం 6 లక్షల మంది మూలవిరాట్టును దర్శించుకోగా, దాదాపు 15 లక్షల మంది శ్రీవారి వాహన సేవలను వీక్షించారని చెప్పారు. ప్రత్యేకించి గరుడసేవలో దాదాపు 3.5 లక్షల మంది భక్తులు పాల్గొన్నట్టు తెలిపారు.

శ్రీవారికి సీఎం పట్టువస్త్రాల సమర్పణపై వ్యంగ్యంగా పోస్టు

- విజిలెన్స్ ఫిర్యాదుతో కేసు నమోదు

తిరుమల శ్రీవారి బ్రహ్మోత్సవాల సందర్భంగా సీఎం చంద్రబాబు పట్టువస్త్రాల సమర్పణపై వ్యంగ్యంగా పోస్ట్ చేసిన వ్యవహారంపై టీటీడీ సీరియస్ అయింది. విజిలెన్స్ వింగ్ ఫిర్యాదు మేరకు తిరుమల వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. బ్రహ్మోత్సవాల్లో తొలిరోజైన ఈ నెల 4న చంద్రబాబు.. శ్రీవారికి సమర్పించే పట్టువస్త్రాలు తలపై పెట్టుకుని ధ్వజస్తంభానికి మొక్కుతున్న వీడియో స్క్రీన్ షార్ట్‌ను చైతన్య అనే వ్యక్తి 'బ్రైండ్ మన్' అనే ఎక్స్ పేజ్‌లో పోస్టు చేశారు. దానికింద 'దేవుడికి ఇష్టం లేదు అని స్పష్టంగా కనిపిస్తుంది. మళ్లీ చెప్తున్నా ప్రాణగండం ఉంది' అంటూ నవ్వుతున్న రెండు ఎమోజీలను జత చేశారు. ఈ వ్యవహారంపై టీటీడీ విజిలెన్స్ విభాగం ఏవీఎస్వో పద్మనాభం ఫిర్యాదు చేశారు. చైతన్యతో పాటు సంబంధిత వ్యక్తులపై కేసు నమోదు చేశారు.

పోటెత్తిన ఇంద్రకీలాద్రి

- విజయదశమికి భారీగా తరలివచ్చిన భక్తులు
- మూలా నక్షత్రం రోజు కంటే ఎక్కువగా రాక
- ఒక్కరోజే సుమారు 2 లక్షల మందికి దర్శనం
- కృష్ణానదికి ఇన్‌ఫ్లో కారణంగా నదీ విహారం రద్దు
- ముగిసిన శరన్నవరాత్రి ఉత్సవాలు





శనివారం బెజవాడ దుర్గమ్మ దర్శనం కోసం తరలి వచ్చిన భవానీ దీక్షాధారులు; (ఇన్‌సెట్) రాజరాజేశ్వరీ రూపంలో దుర్గమ్మ

విజయవాడ, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): ఇంద్రకీలాద్రిపై దసరా శరన్నవరాత్రి మహోత్సవాలు శనివారం ముగిశాయి. పూర్ణాహుతితో ఉత్సవాలకు ముగింపు పలికారు. శ్రీరాజరాజేశ్వరీ దేవి అలంకారంలో ఉన్న అమ్మవారిని దర్శించుకోవడానికి భక్తులు పెద్దఎత్తున తరలివచ్చారు. శనివారం సాయంత్రం పార్వతి, గంగ సమేత మల్లికార్జునస్వామి ఉత్సవమూర్తులకు నగరోత్సవం నిర్వహించారు. అనంతరం కనకదుర్గానగర్ మీదుగా దుర్గాఘాట్‌కు తీసుకొచ్చి హంస వాహనంపై ఉంచి పూజలు చేశారు. కృష్ణానదికి ఇన్‌ఫ్లో కారణంగా నదీ విహారాన్ని రద్దు చేశారు. అనంతరం ఉత్సవ మూర్తులను పోలీసులకు అప్పగించారు. వారు దుర్గాఘాట్ నుంచి ఊరేగింపుగా వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌కు తీసుకెళ్లారు. ఇక్కడ శమీవృక్షం వద్ద ఉన్న ఆలయంలో శమీపూజ నిర్వహించిన అనంతరం ఊరేగింపుగా తీసుకెళ్లి ఆలయ అర్చకులకు అప్పగించారు. కాగా, విజయదశమి ఒక్కరోజే సుమారు 2లక్షల మంది భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ ఏడాది దశమి రోజు అంతకుమించి తరలివచ్చా రు. ఆలయానికి ఉన్న అన్ని వైపులా రహదారులు భక్తులతో నిండిపోయాయి. పోలీసులు అప్పటికప్పుడు అదనపు బందోబస్తును ఏర్పాటు చేసుకోవాల్సి వచ్చింది. తొలిసారిగా ఆక్టోపస్‌ను రంగంలోకి దింపారు. భక్తుల రాక వాస్తవ పరిస్థితిని తెలుసుకునేందుకు ఏడు డ్రోన్లను ఉపయోగించారు. ఉత్సవాల చరిత్రలోనే తొలిసారిగా దసరా రోజు, ఆ మర్నాడు హోల్డింగ్ పాయింట్లను ఉపయోగించాల్సి వచ్చింది. భక్తుల రద్దీ కారణంగా విజయదశమి రోజున అన్ని వీవీఐపీ, వీఐపీ దర్శనాలను రద్దు చేశారు. ఆదివారం కూడా రద్దీ కొనసాగింది.

రాయితీ వంట నూనెను సద్వినియోగం చేసుకోండి

● తెనాలి ఆయిల్ మర్చంట్ అసోసియేషన్ సభ్యులు

తెనాలి, మారీసుపేట అక్టోబరు 13: పెరిగిన వంటనూనె ధరల భారం పేదలపై పడకూడదన్న సదుద్దేశంతో రాయితీపై వంట నూనెను విక్రయించేందుకు నిర్ణయం తీసుకున్నట్లు తెనాలి ఆయిల్ మర్చంట్ అసోసియేషన్ సభ్యులు తెలిపారు. స్థానిక గంగానమ్మపేటలోని తెనాలి ఆయిల్ మర్చంట్ అసోసియేషన్ కార్యాలయంలో ఆదివారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘ సభ్యులు పద్మనాభుని మురళీమోహన్ మాట్లాడుతూ రైతులకు మద్దతు ధర పెంచి దేశీయంగా నూనె గింజల సాగును ప్రోత్సహించాలని కేంద్ర ప్రభుత్వం వంటనూనెల దిగుమతిపై సుంకం సుమారు 20% పెంచిందన్నారు. దీంతో వంట నూనెల ధరలు పెరిగాయన్నారు. ఈ భారం పేదలకు కొనలేని విధంగా ఉండటంతో ఈ నెల 10వ తేదీన రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో విజయవాడ పౌరసరఫరాల కార్యాలయంలో ఏర్పాటుచేసిన ప్రత్యేక సమావేశంలో పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్, ఉన్నతాధికారులు రాష్ట్ర ఆయిల్ అసోసియేషన్ ప్రతినిధులతో రాయితీతో పేదలకు ఆయిల్ అందించేలా సహకరించాలని కోరినట్లు తెలిపారు. వారి విజ్ఞప్తిమేరకు తెల్లరేషన్ కార్డు ఉన్న పేదలకు రాయితీపై ఒక్కో కార్డుదారునికి 3 ప్యాకెట్‌లు అందించేలా నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. తెనాలి ప్రాంతంలోని 18 ఆయిల్ షాపులలో పామాయిల్ ఒక ప్యాకెట్ ధర రూ.110, సన్‌ఫ్లవర్ ప్యాకెట్ ఒకటి ధర రూ.124కి అందుబాటులో ఉంచినట్లు వెల్లడించారు. బహిరంగ మార్కెట్‌లో వాటి ధరలు పామోలిన్ నూనె ధర రూ.120 సన్‌ఫ్లవర్ ఆయిల్ ధర రూ.132 గా ఉన్నాయన్నారు. ప్రతి తెల్లరేషన్ కార్డుదారుడు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సంఘ సభ్యులు పద్మనాభుని మురళీమోహన్, పీబీ సుబ్బారావు, గుర్రం వెంకట సుధీర్‌కుమార్, నాగసూరి భరత్, ఏవీవీ మహేష్, మనోహర్, చైతన్య, శేఖర్, జగన్‌మోహన్ తదితరులు పాల్గొన్నారు.

నేడు ఐటీఐ అప్రంటీస్ మేళా

తెనాలి అర్బన్, అక్టోబరు 13: జగ్గడిగుంటపాలెంలోని ప్రభుత్వ ఐటీఐలో సోమవారం అప్రంటీస్ మేళా నిర్వహించనున్నట్లు ఐటీఐ జిల్లా కన్వీనర్ రావి చినవెంకటేశ్వర్లు ఆదివారం ఒక ప్రకనలో పేర్కొన్నారు. మేళాకు ప్రభుత్వ, ప్రైవేట్ ఐటీఐలలో అన్ని ట్రేడ్‌లలో శిక్షణ పొంది సర్టిఫికెట్లు ఉన్న విద్యార్థులు బయోడేటా, విద్యార్హత నకలు, ఫొటో, ఆధార్‌తో హాజరుకావాలని సూచించారు. 15 కంపెనీల ప్రతినిధులు విద్యార్థులను ఎంపిక చేస్తారని తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

తెనాలి అర్బన్, అక్టోబరు 13: పట్టణంలోని డీ-3 సెక్షన్ పరిధిలో సోమవారం విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు ఏఈ వెంకటసుధీర్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జయప్రకాష్‌నగర్, వీఎస్ఆర్ కళాశాల రోడ్డు, బస్టాండ్ ఏరియాలలో చెట్ల కొమ్మల తొలగింపు చేపట్టినందున ఉదయం 7గంటల నుంచి 10 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని వినియోగదారులు సహకరించాలని కోరారు.

నేటి నుంచి 20 వరకు పల్లె పండుగ

తెనాలి రూరల్,అక్టోబరు 13: ప్రభుత్వ ఆదేశాల మేరకు తెనాలి మండలంలోని 18 గ్రామాల్లో ఈ నెల 14 నుంచి 20వరకూ పల్లె పండుగ వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో అత్తోట దీప్తి, ఈవోపీఆర్డీ వైవీడీ ప్రసాద్‌లు తెలిపారు. గ్రామాల్లో అభివృద్ధి కార్యక్రమాలపై కార్యాచరణ సిద్ధం చేయడం, గ్రామస్థుల సమస్యలపై వినతులు స్వీకరించి తక్షణమే పరిష్కరించేలా కార్యాచరణతో ముందుకు సాగటం జరుగుతుందన్నారు.



చేపల వ్యాపారుల వివరాలను నమోదు చేస్తున్న శానిటరీ ఇన్‌స్పెక్టర్ నజీర్, ఉమామహేశ్వరావు తదితరులు

ఫుట్‌పాత్ వ్యాపారుల తరలింపు

తెనాలి, మారీసుపేట అక్టోబరు 13: పట్టణంలోని బస్టాడు సమీపంలో విజయవాడ ప్రధాన రహదారి ఫుట్‌పాత్‌పై చేపలు, రొయ్యల వ్యాపారం చేసే వారిని మున్సిపల్ అధికారులు ఆదివారం వారిని అక్కడ నుంచి తరలించారు. ఈ సందర్భంగా శానిటరీ ఇన్‌స్పెక్టర్ నజీర్ మాట్లాడుతూ మున్సిపల్ కమిషనర్ శేషన్న ఆదేశాలతో ఫుట్‌పాత్, రహదారుల వెంబడి వ్యాపారాలతో ట్రాఫిక్ సమస్యలు ఏర్పడుతున్నాయని, వాహన చోదకులు, ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. చేపల వ్యర్థాలను కాలువల్లో వేయడం వలన నీరు కలుషితం అవుతుందన్నారు. దీంతో ఆయా వ్యాపారులను వేరే ప్రదేశానికి తరలించేందుకు సూచనలు చేశామన్నారు. కార్యక్రమంలో పారిశుధ్య కార్యదర్శులు ఉమామహేశ్వరావు, నరేష్, వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

క్రీడాస్ఫూర్తి అవసరం: డాక్టర్ కృష్ణసందీప్



పోటీలను ప్రారంభిస్తున్న డాక్టర్ సందీప్

తెనాలి అర్బన్, అక్టోబరు 13 : క్రీడాకారులకు క్రీడాస్ఫూర్తి ఎంతో ముఖ్యమని, డాక్టర్ ఆలపాటి కృష్ణసందీప్ తెలిపారు. బుర్రిపాలెం రోడ్డులో ఆదివారం ప్రారంభమైన క్రికెట్ టోర్నమెంట్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా డాక్టర్ కృష్ణసందీప్ మాట్లాడుతూ యువత చెడు వ్యసనాలకు లోను కాకుండా నచ్చిన రంగంలో రాణించేందుకు కృషి చేయాలన్నారు. విజేతలకు రూ.15వేలు, రూ.8వేలు, రూ.4 వేలు మొదటి మూడు బహుమతులుగా ఇస్తామని నిర్వాహకులు తెలిపారు. మూడు రోజుల పాటు నిర్వహించే టోర్నమెంట్‌లో ప్రతి టీమ్‌కి రూ.వెయ్యి ప్రోత్సాహక బహుమతి అందిస్తామన్నారు. షేక్ సమీర్, అమీర్ సోహెల్, రేవంత్, తరుణ్, అక్షయ్, చాణక్య పాల్గొన్నారు.

బాలాజీరావు పేటలో చోరీ

తెనాలి, మారీసుపేట అక్టోబరు 13: తెనాలి పట్టణంలోని ఓ ఇంట్లో జరిగిన చోరీ ఘటన కలకలం సృష్టించింది. పోలీసులు, బాధిత కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. పోలీసు శాఖలో అటెండర్‌గా పనిచేసి ఉద్యోగ విరమణ పొందిన ఈలప్రోలు శివన్నారాయణ, భార్య వెంకాయమ్మతో కలిసి స్థానిక బాలాజీరావుపేటలో ఓ ఇంట్లో నివాసముంటున్నారు. 8వ తేదీ కుటుంబంతో కలసి తీర్థయాత్రకని వెళ్లారు. ఇంటిలో ఎవరూ లేని విషయాన్ని తెలుసుకున్న గుర్తుతెలియని దుండగులు ఇంటి తాళాలు పగలకొట్టి, లోనికి ప్రవేశించి, బీరువాలోని బంగారు ఆభరణాలు, ఇతర వస్తువులను అపహరించుకుపోయారు. ఆదివారం ఇంటికి వచ్చిన శివన్నారాయణ ఇంటి తాళాలు పగలకొట్టి ఉండటాన్ని గుర్తించాడు. ఇంట్లోకి వెళ్లి చూడగా బీరువాలో నగలు అపహరణకు గురయినట్లు గుర్తించి స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశాడు. క్లూస్ టీం వచ్చి వివరాలు సేకరించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు త్రీటౌన్ పోలీసులు వెల్లడించారు.

19న రోటరీ కార్యక్రమాలను విజయవంతం చేద్దాం

● రోటరీ క్లబ్ అధ్యక్షుడు శ్రీనివాసరావు

తెనాలి, మారీసుపేట అక్టోబరు 13: పట్టణంలో ఈ నెల 19న రోటరీ క్లబ్ ఆఫ్ తెనాలి వైకుంఠపురం ఆధ్వర్యంలో నిర్వహించే సేవా కార్యక్రమాలను విజయవంతం చేయాలని రోటరీ క్లబ్ అధ్యక్షుడు శ్రీనివాసరావు క్లబ్ సభ్యులను కోరారు. స్థానిక గౌతమ్ హోటల్లో ఆదివారం ఆయన అధ్యక్షతన క్లబ్ సభ్యుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ 19వ తేదీన తెనాలి అఫీషియల్ విజిట్‌కు రోటరీ డిస్ట్రిక్ 3150 గవర్నర్ కాట్రగడ్డ శరత్‌చౌదరి వస్తున్నారని, ఆ రోజు చేపట్టే కార్యక్రమాల్లో సభ్యులందరూ పాల్గొనాలని సూచించారు. సమావేశంలో క్లబ్ కార్యదర్శి డీ మురళీకృష్ణ, కోశాధికారి రమేష్‌కుమార్‌జైన్, ఈదర వెంకట పూర్ణచంద్, కన్నెగంటి మురళీకృష్ణ, డాక్టర్ రవీంద్రనాథ్, గుత్తా వెంకటరత్నం, డాక్టర్ జీవన్‌లత, జగదీశ్వరమ్మ, కె ఉపేంద్ర, గుమ్మడి ప్రసాద్, కిరణ్ చౌదరి, సుబ్బారావు, అర్జున్ పాల్గొన్నారు.

రతన్‌టాటా మృతి దేశానికి తీరనిలోటు: వీరవల్లి మురళి

తెనాలి రూరల్, అక్టోబరు 13: గొప్ప సేవామూర్తి, దేశభక్తుడు, పారిశ్రామిక దిగ్గజం రతన్‌టాటా మృతి భారతదేశానికి తీరనిలోటని గణేష్‌యూత్ కన్వీనర్, టీడీపీ సీనియర్ నేత వీరవల్లి మురళి అన్నారు. వ్యాపార వేత్తగా లక్షలాదిమందికి ఉపాధి కల్పించడంతోపాటు పేదలకు సైతం కారు కలిగి ఉండాలన్న ఆలోచనతో కేవలం రూ.లక్షతో నానోకారు రూపొందించి వారి ఆశలను సాకారం చేశారన్నారు. వ్యాపార వేత్తగా కోటాను కోట్లు సంపన్నుడైనా సాధారణ జీవితాన్ని గడిపాడని అతని ఆదాయంలో 80శాతం పేదల కోసం ఖర్చుచేసిన గొప్ప మానవతామూర్తి దివంగత రతన్‌టాటా అని కొనియాడారు.



తెనాలి: వాసవీ అమ్మవారిని ఊరేగిస్తున్న కమిటీ సభ్యులు



బతుకమ్మ ఉత్సవంలో పాల్గొన్న మహిళలు

ముగిసిన విజయదశమి ఉత్సవాలు



శ్రీ విద్యాపీఠంలో రాజరాజేశ్వరి అమ్మవారికి ప్రత్యేక పూజలను నిర్వహిస్తున్న బాలస్వామి తదితరులు



ఎరుకలపూడిలో కోలాట నృత్య ప్రదర్శన

పొన్నూరు టౌన్, అక్టోబరు 13: 9రోజుల పాటు వివిధ రూపాలలో విభిన్న అలంకారంలో దర్శనమిచ్చిన నవరాత్రి ఉత్సవాలు ఆదివారం భక్తిశ్రద్ధలతో ముగిశాయి. చివరిరోజు అమ్మవారు పుష్పశయన అలంకారంలో భక్తులకు దర్శనం ఇచ్చింది. పట్టణ శివారులోని జీబీసీ రోడ్డులోని కనకదుర్గా భవానీ ఆలయంలో శనివారం విజయదశమి ఉత్సవాలు వైభవంగా జరిగాయి. విజయదశమిని పురస్కరించుకుని భక్తులు అమ్మవారిని దర్శించుకునేందుకు పెద్ద సంఖ్యలో ఆలయానికి తరలివచ్చారు. శనివారం పుష్పశయన అలంకారంలో అమ్మవారు దర్శనమిచ్చింది. వాసవి కన్యకాపరమేశ్వరి, పార్వతి దేవి, కాశీవిశాలాక్షమ్మ, చింతలపూడి భ్రమరాంబదేవి విజయదశమి పూజలు అందుకున్నారు. తోటమ్మ తల్లి ఆలయంలోని అమ్మవారు కళాత్మికదేవిగా దర్శనం ఇచ్చింది. చివరిరోజు అమ్మవారిని యాలుకులు, అంజీరా, బాదం, జీడిపప్పు వంటి పలు సుంగధ ద్రవ్యాలతో ప్రత్యేక అలంకరణ చేశారు. ఈ అలంకారంలో అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు.

● తెనాలి అర్బన్: విజయదశమి ఉత్సవాలు పట్టణంలో వైభవంగా ముగిశాయి. పలు ఆలయాల్లో అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు



నందివెలుగులో భక్తులకు దర్శనమిస్తున్న శ్రీ కనకదుర్గమ్మతల్లి

భారీ సంఖ్యలో బారులుతీరారు. గంగానమ్మపేటలో రూ.25 లక్షలతో నూతనంగా తయారు చేసిన ప్రత్యేక రథంలో బాలత్రిపురసుందరి అమ్మవారిని ఊరేగించారు. వాసవీ ఆలయంలో కమిటీ అధ్యక్షుడు నూకల వెంకటవేణు గోపాలరావు, మున్సిపల్ వైస్ చైర్మన్ మాలేపాటి హరిప్రసాద్, కార్యదర్శి బూరెల నరసింహారావు, కమిటీ సభ్యులు అమ్మవారి రథోత్సవంలో పాల్గొన్నారు. మారీసుపేటలో మహిళలు బతుకమ్మ ఉత్సవంలో పాల్గొన్నారు. ఉత్సవాల సందర్భంగా ఆదివారం పలు చోట్ల భక్తులకు అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం అమ్మవారిని ఊరేగించి తూర్పు కాల్వలో నిమజ్జనం చేశారు. పండరీ కోలాట నాట్యమండలి ఆధ్వర్యంలో కోలాటం ప్రదర్శించారు. చెంచుపేట గోదా పద్మావతి సమేత వెంకటేశ్వర స్వామి ఆలయంలో అష్టోత్తర కలశాభిషేక తిరునక్షత్ర ఉత్సవాలు వైభవంగా నిర్వహించారు. ఉప్పుబజారులో దుర్గాభవానీ కమిటీ ఆధ్వర్యంలో అమ్మవారిని ఊరేగించి నిమజ్జనం చేశారు.

● తెనాలి రూరల్: దసరా పండుగను పురస్కరించుకుని మండలంలోని కొలకలూరులో చరిత్ర ప్రసిద్ధిచెందిన శ్రీ వెంకటేశ్వరస్వామి వారి ఆలయానికి తహసీల్దార్ గోపాలకృష్ణ కుటుంబసమేతంగా విచ్చేసి స్వామివార్లను దర్శించి హోమాది పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ నిర్వహకులు తహసీల్దార్‌ను ఆలయ మర్యాదలతో ఆహ్వానించి స్వామి వారి పూజల అనంతరం వేద ఆశీస్సులు అందించి ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో పలువురు భక్తులు పాల్గొన్నారు.

● కొల్లిపర: దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఆదివారం దుర్గాదేవి నిమజ్జనోత్సవాలను ఘనంగా నిర్వహించారు. మండలంలో వల్లభాపురం, మున్నంగి, తూములూరు, అత్తోట, దావులూరుపాలెం తదితర గ్రామాల్లో ఏర్పాటుచేసిన దుర్గాదేవి అమ్మవారి విగ్రహాలకు భక్తులు 10 రోజుల నుంచి వైభవంగా పూజలు చేశారు. ప్రత్యేకంగా అలంకరించిన ట్రాక్టర్లపై అమ్మవారి విగ్రహాలను ఏర్పాటు చేసి గ్రామాల్లో మేళతాళాలతో ఊరేగింపు నిర్వహించారు. ఆర్యవైశ్య సంఘ జిల్లా ఉపాధ్యక్షుడు అన్నవరపు రమేష్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అమ్మవారికి మహిళలు పసుపు, కుంకుమలతో పూజలు చేశారు. అనంతరం ట్రాక్టర్‌పై దుర్గాదేవి విగ్రహాన్ని ఏర్పాటుచేసి భారీ ఎత్తున ఊరేగింపు నిర్వహించారు. మేళతాళాలతో, డబ్బు వాయిద్యాలతో, బాణసంచా కాల్చుకుంటూ గ్రామపురవీధుల్లో ఊరేగింపు నిర్వహించి కృష్ణానదిలో అమ్మవారి విగ్రహాన్ని నిమజ్జనం చేశారు.

● తెనాలి రూరల్: మండల గ్రామాల్లో దేవి శరన్నవరాత్రి ఉత్సవాలు ఆదివారంతో ముగిశాయి. చరిత్ర ప్రసిద్ధిచెందిన నందివెలుగు అగస్త్యేశ్వర స్వామి వారి ఆలయంలో విజయదశమిని పురస్కరించుకుని అమ్మవారి ఆలయానికి భక్తులు పోటెత్తారు. తెల్లవారుజామునుంచే వివిధ గ్రామాల నుంచి వచ్చే భక్తులతో ఆలయ ప్రాంగణం కిక్కిరిసిపోయింది. కనకదుర్గమ్మ అమ్మవారి దర్శనం అనంతరం కమిటీ సభ్యులు అన్నప్రసాద వితరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. మండలంలోని ఎరుకలపూడిలో ప్రసిద్ధిచెందిన బాలసుబ్రహ్మణ్యస్వామి వారి దేవస్థానంలో లలితాపరమేశ్వరి శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా విజయదశమి పర్వదినాన్ని పురస్కరించుకుని అమ్మవారిని దర్శించేందుకు భక్తులు పెద్దసంఖ్యలో ఆలయానికి విచ్చేశారు. కమిటీ సభ్యులు అన్నప్రసాద వితరణ చేశారు. అక్కడే ఏర్పాటుచేసిన కోలాట ప్రదర్శన భక్తులకు ఆకట్టుకుంది. మండలంలోని పెదరావూరు సుబ్రహ్మణ్యపురంలో శారదా నవరాత్రి ఉత్సవాలు వైభవంగా నిర్వహించారు. చివరిరోజు అమ్మవారికి విశేషపూజలు జరిపారు. పరిసర గ్రామాల



కొల్లిపరలో అమ్మవారికి ఊరేగింపు నిర్వహిస్తున్న భక్తులు

నుండి భక్తులు పెద్దసంఖ్యలో విచ్చేసిస్వామి వార్లను దర్శించుకున్నారు. ఆలయ నిర్వాహకులు భక్తులకు అన్నప్రసాదాన్ని పంపిణీచేశారు. మండలంలోని పలు ఆలయాల్లో, వివిధ కమిటీల ఆధ్వర్యంలో నిర్వహించిన దశరా ఉత్సవాలు ఆదివారం స్వామివార్ల గ్రామోత్సవంతో ముగిశాయి.

● తెనాలి, మారీసుపేట: పట్టణంలో అన్ని ఆలయాలలో దసరా నవరాత్రి మహోత్సావాలు ముగిశాయి. స్థానిక గంగానమ్మపేటలోని విద్యాపీఠం సాలిగ్రామ మఠం ట్రస్ట్ సభ్యుల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న దశరా వేడుకల్లో విజయదశమి రోజు అమ్మవారు రాజరాజేశ్వరిదేవి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారికి సుప్రభాత సేవ, అభిషేకాలు, పూజలు నిర్వహించారు. మహిళలు సామూహిక కుంకుమార్చలను నిర్వహించారు. కార్యక్రమంలో ట్రస్ట్ చైర్మన్ నంబూరు వెంకట కృష్ణమూర్తి, ముద్దాభక్తుని రమణయ్య, రావూరి సుబ్బారావు, పెనుగొండ వెంకటేశ్వరావు, గోపు రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

రైతు సేవకే సహకార సమాఖ్యలు: ఎమ్మెల్యే ధూళిపాళ్ళ



తైవాన్ స్ప్రేయర్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్ తదితరులు

పొన్నూరు టౌన్, అక్టోబరు 13: రైతులకు అవసరమైన అన్నిరకాల సేవలు అందించేందుకు సహకార సమాఖ్యలు ఏర్పాటు చేసినట్లు ఎమ్మెల్యే, సంగం డెయిరీ చైర్మన్ ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్ తెలిపారు. మండల పరిధిలోని మునిపల్లెలో శనివారం ధూళిపాళ్ళ వీరయ్య చౌదరి ఫార్మర్స్ ప్రొడ్యూసర్స్ కంపెనీని నరేంద్ర కుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా మండల పరిధిలోని సహకార సమాఖ్యలోని 72మంది రైతులకు రాయితీపై తైవాన్ స్ప్రేయర్లును నరేంద్రకుమార్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జరిగిన సభలో నరేంద్రకుమార్ మాట్లాడుతూ రైతుల అభ్యున్నతే ధ్యేయంగా పనిచేస్తునట్లు చెప్పారు. రైతు సహకార సమాఖ్యల ద్వారా అనేక రకాల సేవలు అందించేందుకు కృషి చేస్తునట్లు వివరించారు. రైతు భాగస్వామ్యంతో ఈ సహకార సమాఖ్యలు ఏర్పాటు చేశామన్నారు. ఈ సందర్భంగా రాయితీపై యంత్ర పరికరాలతోపాటు విత్తనాలు, పురుగు మందులు అందిస్తామన్నారు. రైతులకు అవసరమైన అన్నిరకాల సేవలను అందించనునట్లు చెప్పారు. రైతులు కోరితే తమ పంట ఉత్పత్తులను నిల్వ చేసుకునేందుకు గిడ్డంగుల నిర్మాణం చేపట్టనున్నట్లు చెప్పారు. ఈ గిండ్డంగుల నిర్మాణానికి స్థలం కేటాయించాలని ప్రభుత్వాన్ని కోరుతామన్నారు. ధాన్యం కొనుగోలు చేసి వినియోగదారులకు బియ్యం అందించేందుకు అవసరమైతే రైస్ మిల్లు ఏర్పాటు చేయటానికి ప్రయత్నిస్తునట్లు చెప్పారు. అలాగే రైతులకు తక్కువ వడ్డీకి రుణాలు అందించే సదుపాయం కూడా ఈ సమాఖ్య ద్వారా కల్పిస్తామన్నారు. కేంద్ర ప్రభుత్వ సహకారంతో డ్రోన్ టెక్నాలజీని రైతులకు అందుబాటులోకి తీసుకురానున్నట్లు చెప్పారు. ఔత్సాహిక రైతులు ముందుకు వస్తే వారి సహకారంతో రైతు సమాఖ్యలు ఏర్పాటు చేయనునట్లు చెప్పారు. రాష్ట్రానికే ఆదర్శవంతంగా ఈ రైతు సమాఖ్యలు తీర్చిదిద్దుతామన్నారు. కార్యక్రమంలో జనసేన సమన్వయ కర్త వడ్రాణం మార్కండేయ బాబు, రైతు సమాఖ్య, పాలకవర్గ సభ్యులు, కూటమి పార్టీల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పల్లె పండుగతో గ్రామాల ప్రగతి బాటకు ప్రణాళికలు

పొన్నూరు టౌన్, అక్టోబరు 13: మౌలిక వసతుల లేమితో కొట్టుమిట్టాడుతున్న గ్రామాలకు పల్లె పండుగ ప్రగతి బాటలు వేయనున్నది. రాష్ట్ర ప్రభుత్వం నియోజకవర్గాల వ్యాప్తంగా ఈ నెల 14వ తేదీ నుంచి 20వ తేదీ వరకు ప్రతి గ్రామ పంచాయతీలో ఈ పల్లె పండుగ వారోత్సవాలు నిర్వహించేందుకు కార్యాచరణ రూపొందించింది. గత వైసీపీ ప్రభుత్వంలో గ్రామాల ప్రగతి పూర్తిగా కుంటుపడింది. గ్రామాలలో ప్రజలకు అవసరమైన మౌలిక వసతులు, రహదారులు, మురుగు కాల్వల నిర్మాణం వైపు ప్రభుత్వం, అప్పటి పాలకులు దృష్టి సారించలేదు. టుచూసినా గ్రామాలలో రహదారులు బురదమయంకావటం, జనావాసాల వద్దే మురుగునీరు నిల్వ ఉండటంతో ప్రజలు సమస్యతో సతమతమయ్యారు.

ఈ నెల 14వ తేదీ నుంచి చేపట్టనున్న పల్లె పండుగ గ్రామాలో ప్రగతి బాటలు వేయనున్నదని సర్వత్రా హర్షం వ్యక్తం అవుతోంది. కూటమి ప్రభుత్వం అధికారంలోని రాగానే గ్రామీణాభివృద్ధిపై పాలకులు ప్రత్యేక దృష్టి సారించారు. ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ గ్రామాల మౌలిక వసతుల కల్పనపై ప్రత్యేక దృష్టి సారించి ఇప్పటికే గ్రామ సభలు నిర్వహించటం ద్వారా రికార్డులు నెలకొల్పారు. ఈ సభల ద్వారా ప్రజలకు అవసరమైన పనులను తీర్మానం చేసి ప్రభుత్వానికి విన్నవించారు. ఎమ్మెల్యే, సంగం డెయిరీ చైర్మన్ ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్ సైతం గ్రామాల అభివృద్ధికి ప్రత్యేక దృష్టి సారించారు. ఎన్నికల సమయంలో గ్రామాలో విస్తృతంగా పర్యటించిన సమయంలో ప్రజలు తెలియజేసిన అనేక సమస్యలను రికార్డు చేయించి ప్రజలు కోరిన పనులన సత్వరమే పూర్తి చేసేలా పంచాయతీరాజ్ శాఖ అధికారులతో సమీక్షించి పనులను మంజూరు చేయించారు. ఈ పల్లె పండుగ ద్వారా నియోజకవర్గంలోని మూడు మండలాలో 50 పనులకు శంకుస్థాపన చేసేలా కార్యాచరణ రూపొందించారు. వారం రోజుల పాటు గ్రామాలో రహదారులు, మురుగు కాల్వల నిర్మాణానికి ఈ శంఖుస్థాపన కార్యక్రమం చేయనున్నారు. ఇప్పటికే నిధులు మంజూరైనందున మౌలిక వసతుల కల్పన సుసాధ్యం కానున్నదని కూటమి పాలకులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ పనుల ద్వారా పొన్నూరు మండలంలో రూ.కోటి వ్యయంతో సిమెంటు రహదారులు, మురుగు కాల్వల నిర్మాణం చేపట్టనున్నారు, చేబ్రోలు మండలంలో రూ. 90 లక్షలకు పనులు శంకుస్థాపనలు జరగనున్నాయి. పెదకాకాని మండలంలో రూ.కోటి వ్యయంతో ఈ పనులను నిర్మాణానికి ప్రయత్నాలు సాగిస్తున్నారు.

అన్న క్యాంటీన్‌కు రూ.లక్ష విరాళం



అన్న క్యాంటీన్‌కు రూ.లక్ష విరాళం అందజేస్తున్న మునిపల్లెకు చెందిన పరమేశ్వరరావు

పొన్నూరు టౌన్, అక్టోబరు 13: మండల పరిధిలోని మునిపల్లె గ్రామానికి చెందిన మెట్ల పరమేశ్వరరావు అన్న క్యాంటీన్ నిర్వహణ కోసం రూ.లక్ష విరాళాన్ని అందచేశారు. శనివారం మండల పరిధిలోని మునిపల్లె గ్రామంలో ఎమ్మెల్యే, సంగం డెయిరీ చైర్మన్ ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్ చేతుల మీదుగా ఈ విరాళాన్ని అందచేశారు. ఈ సందర్భంగా పరమేశ్వరరావును ఎమ్మెల్యే, గ్రామస్థులు ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో జనసేన సమన్వయకర్త వడ్రాణం మార్కండేయబాబు, మండల టీడీపీ అధ్యక్షుడు బండ్లమూడి బాబురావు, అత్తోట వెంకట అప్పారావు, గూడూరు బాబు, అల్లూరి వెంకట శివరామప్రసాద్, నాగబైరవ వెంకట పూర్ణ, చైతన్య ఆకేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

మృతురాలికి ఎమ్మెల్యే నివాళి

పొన్నూరు టౌన్, అక్టోబరు 13: పట్టణంలోని నిడుబ్రోలు 13వ వార్డుకు చెందిన తురుమెళ్ల దానమ్మ మృతికి ఎమ్మెల్యే, సంగం డెయిరీ చైర్మన్ ధూళిపాళ్ల నరేంద్ర కుమార్ శనివారం నివాళి అర్పించారు. మండల విద్యాశాఖ అధికారి తురుమెళ్ల నవీన్ కుమార్ తల్లి దానమ్మ మృతి వార్త తెలుసుకుని నరేంద్ర కుమార్ దానమ్మ మృతదేహాన్ని సందర్శించి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. నిడుబ్రోలు టీడీపీ అధ్యక్షుడు జాగర్లమూడి సుధీర్, గోగినేని రజినీకుమార్, బండారు వంశీ, గోవాడ అరవింద్, చల్లశెట్టి సీతరామయ్య, పొన్నగంటి వాసు, ఎద్దు సోంబాబు, యాతాటి చౌదరి, గోపి, చల్లపల్లి శోభరాజ్, మస్తాన్ వలీ, జి.ఏసుపాదం తదితర టీడీపీ నాయకులు దానమ్మ మృతదేహాన్ని సందర్శించి నివాళి అర్పించారు.

సాయి బాబా మృతి ప్రజా సంఘాలకు తీరని లోటు

● మానవ హక్కుల వేదిక జిల్లా కన్వీనర్ జీఎస్ రాయల్

పొన్నూరు టౌన్, అక్టోబరు 13: హక్కుల ఉద్యమ నేత ప్రొఫెసర్ సాయి బాబా మృతి తీరని లోటు అని మానవ హక్కుల వేదిక జిల్లా కన్వీనర్ జీఎస్ రాయల్ అన్నారు. ఆదివారం మానవ హక్కులు వేదిక కార్యాలయంలో ప్రొఫెసర్ సాయి బాబా సంతాప సభ జరిగింది. సాయిబాబా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా పలువురు ప్రజా సంఘాల నాయకులు మాట్లాడుతూ ఉపాలాంటి నల్ల చట్టాల రద్దుపై సాయిబాబా కృషి చేశారని కొనియాడారు. ప్రభుత్వ నిర్బంధం కారణంగా సుదీర్ఘ కాలం జైలు జీవితం గడిపారని ఆవేదన వ్యక్తం చేశారు. సాయిబాబా మృతి మానవ హక్కుల ఉద్యమానికి ఆదివాసీ హక్కుల ఉద్యమానికి తీరని లోటని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో కుల నిర్మూలన పోరాట సమితి నాయకులు పొందుగల మస్తాన్‌రావు, తోడేటి శ్రీనివాస్, కిషోర్, ప్రజా నాట్యమండలి నాయకుడు కొప్పుల విజయ్‌కుమార్ గుడిసివాస సంఘం నాయకులు బలగాని వెంకటేశ్వర్లు, హక్కుల సంఘాల నాయకులు ఆనంద్, బేతాళ్ల ప్రకాశ్, ముకిరి సునీల్, షేక్ సుభాని, ఆకురాతి మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



నిడుబ్రోలు సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్ క్యారి ఫైయిర్‌ను పరిశీలిస్తున్న కమిషనర్ రమేష్ బాబు

ప్రజలకు స్వచ్ఛమైన నీరు అందిస్తాం: కమిషనర్

పొన్నూరు టౌన్, అక్టోబరు 13: పురపాలక సంఘం పరిధిలోని ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు అందించేలా చర్యలు తీసుకుంటునట్లు మున్సిపల్ కమిషనర్ ముప్పాళ్ల రమేష్‌బాబు తెలిపారు. ఆదివారం నిడుబ్రోలులోని సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా నూతనంగా ఏర్పాటుచేసిన నీటి శుద్ధి యంత్రం క్యారిఫైయర్‌ను పరిశీలించి పనితీరు గురించి పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ రమేష్‌బాబు మాట్లాడుతూ నీటిని క్లోరినేషన్ చేసి సరఫరా చేస్తున్నట్లు చెప్పారు. ప్రజలు కూడా నీటి ఇబ్బందులపై సమాచారం అందించాలని సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



ప్రభుత్వ మద్యం దుకాణం నుంచి అర్ధరాత్రి మద్యం తరలిస్తున్న గుర్తు తెలియని వ్యక్తులు

అర్ధరాత్రి మద్యం తరలింపు

పొన్నూరు టౌన్, అక్టోబరు 13: ప్రభుత్వ మద్యం దుకాణం నుంచి గుర్తు తెలియని వ్యక్తులు అర్ధరాత్రి మద్యం తరలించటం వివాదస్పదంగా మారింది. స్థానికుల కథనం ప్రకారం పట్టణంలోని రైల్వేస్టేషన్ రోడ్డులో ప్రభుత్వ మద్యం దుకాణం ఉంది ఈ మద్యం దుకాణం నుంచి శనివారం రాత్రి 11 గంటల సమయంలో గుర్తు తెలియని వ్యక్తులు దుకాణంలోని మద్యంను నిబంధనలకు విరుద్ధంగా దుకాణం తెరిచి ఆటలో తరలించుకుపోయారు. మరో రెండు రోజుల్లో ప్రభుత్వ మద్యం దుకాణాలు మూసివేసి ప్రైవేటు మద్యం దుకాణాలు రానున్న నేపథ్యంలో ఈ మద్యం తరలింపు అనుమానాస్పదంగా మారింది. వారం పది రోజులుగా ఎక్సైజ్ అధికారులు కేవలం ప్రైవేటు మద్యం దుకాణాలకు సంబంధించి దరఖాస్తుల పనిపై నిమగ్నమైవున్నారు. దీనిని ఆసరాగా తీసుకుని కొద్ది రోజులుగా మద్యం దుకాణంలో పనిచేస్తున్న కొందరు సిబ్బంది అక్రమ మార్గంలో మద్యాన్ని అధిక రేటుకు విక్రయించుకుని సొమ్ము చేసుకున్నారనే ఆరోపణలు ఉన్నాయి. అధికారుల పని ఒత్తిడి కారణంగా పర్యవేక్షణ లేకపోవటంతో షాపులోని ఈ మిగిలిన మద్యాన్ని గుట్టు చప్పుడు కాకుండా తరలించుకుపోయారని ఆరోపణలు వినవస్తున్నాయి. దీనిపై ఎక్సైజ్ సీఐ రమేష్‌బాబును వివరణ కోరగా విచారించి తగు చర్యలు తీసుకుంటామని సీఐ రమేష్ బాబు వెల్లడించారు.

మున్సిపల్ కార్మికులకు దుస్తుల పంపిణీ

తెనాలి, మారీసుపేట అక్టోబరు 13: దసరా పండగను పురస్కరించుకొని పట్టణంలోని 15వ వార్డులో ఆదివారం కౌన్సిలర్ కోటేశ్వరావు కార్యాలయంలో 60 మంది మున్సిపల్ కార్మికులకు దుస్తులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో కౌన్సిలర్ పేరం సంజీవరెడ్డి, తులసిరామ్, కుక్కల వాసు, వెంకట్రావు, కొండలరావు తదితరులు పాల్గొన్నారు.

